


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 144 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 5 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 144 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 5 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఆయనకు మనం ఎప్పుడూ అండగా ఉండాలి

- కేంద్ర మంత్రి కుమారస్వామికి అండగా ఉండాలని లోకేశ్ పిలుపు
- విశాఖ ఉక్కును కాపాడింది ఆయనేనని ప్రశంస
- కర్ణాటకలో సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏపీ మంత్రి
- రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీతోనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశా ఖ మంత్రి హెచ్.డి. కుమార స్వామికి మనమందరం అండగా నిలవాలని ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కుమారస్వామి కాపాడారని, ఆయన కేంద్ర మంత్రిగా ఉండటం మన అదృష్టమని లోకేశ్ అన్నారు. కుమారస్వామికి

మిగతా 2లో




### అమరావతి పనుల్లో వేగం పెంచండి..

## గడువులో రాజీ లేదు

- రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష
- రూ.57,821 కోట్లతో పనులు... వేగం పెంచాలని అధికారులకు సీఎం ఆదేశం
- గడువు విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- ఇది కాంట్రాక్ట్ కాదు, చరిత్రలో భాగస్వామ్యం అవుతున్నారన్న సీఎం
- మానవ వనరులను పెంచుకోవాలని నిర్మాణ సంస్థలకు కీలక సూచన

పెన్ పవర్ డెస్క్:అమరావతి రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం రాజధాని నిర్మాణ పనులపై మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ప్రస్తుతం రాజధానిలో వివిధ దశల్లో ఉన్న రూ.57,821 కోట్ల విలువైన పనుల పురోగతిని ముఖ్యమంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మౌలిక వసతులతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణంపై చర్చించారు. గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన పనులను తిరిగి ప్రారంభించే క్రమంలో ఎదురైన సవాళ్లను, పెరిగిన

మిగతా 2లో



## అమిత్ షా పర్యటనలో భద్రతా వైఫల్యం...

### బెంగాల్‌లో పోలీసు అధికారుల సస్పెన్షన్

- నలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేసిన ఈసీ
- రెండు రోజుల క్రితం అమిత్ షా రోడ్ షోలో ఉద్రిక్తత
- బీజేపీ ఫిర్యాదు నేపథ్యంలో చర్యలు తీసుకున్న ఈసీ

మిగతా 2లో



## ఆ సినిమాలపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది

- కేరళలో ఎన్నికల ప్రచారం
- ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన ప్రధాని మోదీ
- సినిమాలపై కూడా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపణ
- 'ది కేరళ స్టోరీ', 'కశ్మీర్ ఫైల్స్', 'ధురంధర్' చిత్రాల ప్రస్తావన
- సీఏఏ, యూసీసీలపై కూడా అబద్ధాలు వ్యాప్తి చేశారని విమర్శ

మిగతా 2లో

## వైసీపీ దృష్టిలో అమరావతి శాసన రాజధాని మాత్రమే



- అమరావతిపై వైసీపీ వైఖరిని స్పష్టం చేసిన బొత్స
- అమరావతి కోసం రూ. 1.10 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్న
- అమరావతిని వేగంగా పూర్తి చేయకపోతే ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తామని హెచ్చరిక

మిగతా 2లో


## గీత దాటితే సస్పెన్షన్ తప్పదు

### ఎమ్మెల్యే అరవిందబాబుపై చంద్రబాబు సీరియస్

- పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో అరవిందబాబు రచ్చ
- తాను సిఫారసు చేసిన వ్యక్తిని జిల్లా పోలీస్ సెల్ న్యాయ సలహాదారుగా ఎందుకు ఆమోదించలేదని ప్రశ్న
- ఎస్పీ వివరణ ఇచ్చినా తగ్గని అరవిందబాబు
- క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సస్పెండ్ చేస్తానన్న చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు వ్యవహారశైలిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే... నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు పల్నాడు ఎస్పీ కార్యాలయంలో దాదాపు 10 గంటల పాటు బైఠాయించడం వివాదానికి కేంద్రబిందువైంది. జిల్లా పోలీస్ సెల్ న్యాయ సలహాదారుగా తాను సిఫారసు చేసిన రామినేని ప్రసాద్ పేరును ఎందుకు ఆమోదించలేదని ఎస్పీ బి.కృష్ణారావును అరవిందబాబు నిలదీశారు. ఎస్పీ వివరణ ఇచ్చినా వినకుండా, నియామక ఉత్తర్వుల కాపీ చేతికి వచ్చేవరకు కదిలేది లేదని ఎస్పీ ఛాంబర్‌లోనే కూర్చున్నారు.

మిగతా 2లో





### అమరావతి అంటే అప్పు కాదు...

## 5 కోట్ల ఆంధ్రులకు అక్షయపాత్ర

- భూకబ్జాలు, అవినీతికి వైసీపీనే బ్రాండ్ అంబాసిడర్ అని విమర్శ
- రాజధానిపై వైసీపీ నేతలు గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపణ
- రుషికొండ, అమరావతి నిర్మాణ ఖర్చులపై చర్చకు రావాలని సవాల్
- పార్లమెంట్ చట్టంతో అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత లభించిందని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:అమరావతి రాజధాని అప్పుల కుప్ప కాదని, అది 5 కోట్ల ఆంధ్రులకు అక్షయపాత్ర అని తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న అన్నారు. భూక బ్జాలు, అవినీతికి వైసీపీనే కేరాఫ్ అడ్రస్‌గా మారిందని

మిగతా 2లో

### బీఆర్ నాయుడిని తొలగించాలని

## రోజా, భూమన డిమాండ్

- టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు
- ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అపశ్రుతులు జరుగుతున్నాయన్న భూమన
- నాయుడుపై చర్యలు తీసుకోకపోవడం చంద్రబాబు చేతగానితనమన్న రోజా
- లడ్డూ విషయంలో చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలని సిట్ నివేదికలో తేలిందని వ్యాఖ్య




మిగతా 2లో

## ప్రళయం విరుచుకుపడడానికి 48 గంటలే మిగిలి ఉంది

### ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం

- హర్మూజ్ జలసంధిని మూసివేయవద్దని ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- 48 గంటల్లో నరకం చూపిస్తామని, 20 రెట్ల బలంతో దాడి చేస్తామని స్పష్టీకరణ
- ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావంతో పెరుగుతున్న గ్యాస్ ధరలు
- అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో తాజా పరిణామాలు




పెన్ పవర్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌కు అత్యంత తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని మూసివేసే ప్రయత్నం చేస్తే కేవలం 48 గంటల్లో ప్రళయం తప్పదని, నరకం చూపిస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు.ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి ద్వారా సరఫరాను అడ్డుకుంటే, అమెరికా 20 రెట్లు ఎక్కువ బలంతో ప్రతిదాడి చేస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇప్పటికే ఇరాన్ చర్యల

మిగతా 2లో

## ఇరాన్‌పై ఆగని దాడులు..

### శాశ్వత పరిష్కారం కావాలన్న అబ్బాస్ అరాఘ్చీ

- యుద్ధానికి శాశ్వత ముగింపు కావాలన్న ఇరాన్ విదేశాంగ మంత్రి
- చర్చలకు నిరాకరించినట్టు వస్తున్న వార్తలను ఖండన
- టెహ్రాన్‌లోని కీలక సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు
- ఇరాన్ పెట్రోకెమికల్ కంపెనీలపై దాడిలో పలువురికి గాయాలు
- రెండు అమెరికా యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు వెల్లడి

పెన్ పవర్ డెస్క్:అమెరికాతో చర్చలకు ఇరాన్ నిరాకరించిందంటూ వస్తున్న వార్తలను ఆ దేశం ఖండించింది. చర్చలకు తాము ఎప్పుడూ సిద్ధమేనని, అయితే తమపై బలవంతంగా రుద్దిన ఈ యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమే తమ ప్రధాన

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# రాహుల్ గౌరవంగా తప్పుకోవడమే మంచిదా!?

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష సభ్యుడు రాహుల్‌గాంధీ.. గౌరవంగా పార్టీ పదవుల నుంచి తప్పు కోవడమే మంచిదా? ఆయన మౌనంగా ఉండడమే బెటరా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. దాదాపు మూడు ఎన్నికలుగా పార్టీని గెలిపించుకోలేక పోతున్న వైనంతోపాటు.. ఆయన వ్యవహరిస్తున్న తీరు కూడా.. పార్టీలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ముఖ్యంగా కేంద్రంలోని బీజేపీని టార్గెట్ చేసే విషయంలోనూ ఆయన వెనుకబడుతున్నారు. ఈ పరిణామాలు.. పార్టీలో తీవ్ర అసంతృప్తికి, వ్యతిరేక ధోరణికి కూడా దారితీస్తున్నాయి. రాహుల్‌పై గత కొన్నాళ్లుగా సీనియర్లు అసంతృప్తితోనే ఉన్నారు. పార్టీ కాదన్నా.. ఔనన్నా ఇది నిజం. ప్రస్తుత ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఈఅసంతృప్తి పరోక్షంగా పార్టీని దెబ్బతీసేలా వ్యవహరించేలా చేస్తోంది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కనీస పరువు నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ అల్లాడుతోంది. ఈ క్రమంలో నాయకులు కూడా ఐక్యంగా ఉండాలి.కానీ, దీనికి భిన్నమైన వైఖరితో సీనియర్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల వేళ పనిగట్టుకుని పొరుగు పార్టీ బీజేపీని భుజాన మోస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీని పరోక్షంగా ఆకాశానికి ఎత్తేస్తున్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సరిగా వ్యవహరించడం లేదని.. ముఖ్యంగా అమెరికా కనుసన్నల్లో మోడీ పాలన సాగిస్తున్నారని.. రాహుల్‌గాంధీ పార్లమెంటులోనూ బయట కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే.. దీనికి భిన్నంగా పార్టీ సీనియర్లు పలువురు... మోడీని మెచ్చుకుంటున్నారు. మోడీ చాలా స్థితః ప్రజ్ఞతతో వ్యవహరిస్తున్నారని.. అందుకే ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నా.. భారత్‌లో మాత్రం దానికి భిన్నంగా చమురు, గ్యాస్‌కు ఎలాంటి ఇబ్బందులు లేవని.. బీజేపీ నాయకుల కంటే కూడా.. ఎక్కువగా కాంగ్రెస్ సీనియర్లు ఎక్స్ వేదికగా మోడీని కొనియాడేస్తున్నారు. ఈ ప్రభావం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలపై పడే అవకాశం కనిపిస్తోంది.

**రాహుల్‌పైనే రచ్చ!**

అయితే.. ఈ కారణాల నేపథ్యంలో రాహుల్ ఎందుకు మౌనంగా ఉండాలన్నది ప్రశ్న. ఎందుకంటే.. సీని యర్లకు, రాహుల్ గాంధీకి మధ్య భారీ గ్యాప్ పెరుగుతోంది. ఇది ఎన్నికల వేళ మరింత ఎక్కువగా ఉంటోం ది. కేవలం రాహుల్‌పై ఉన్న అక్కసుతోనే.. సీనియర్లు యూటర్న్ తీసుకుంటున్నారన్నది వాస్తవం. అందుకే మరికొందరు నాయకులు రాహుల్ గౌరవంగా తప్పుకోకపోతే.. పార్టీ మరింతగా నష్టపోతుందని వ్యాఖ్యానిస్తున్నారు.

# అమరావతి పనుల్లో వేగం పెంచండి..
# గడువులో రాజీ లేదు

- మొదటి పేజి తరువాయి

నిర్మాణ వ్యయాన్ని అధిగమించి టెండర్లు పూర్తి చేసి పనులు అప్పగించిన తీరును అధికారులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం రాజధానిలో 20 వేల మంది కార్మికులు, నిపుణులు పనిచేస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడు తూ... "రాజధాని నిర్మాణం అనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్ కాదు. ఈ బృహత్కార్యంలో పాలుపంచుకుంటున్న మీరంతా చరిత్రలో భాగస్వాములు అవుతున్నారు. ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉండొచ్చు, కానీ ఒక రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు" అని అన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి 'ఫ్యూచర్ సిటీ'గా నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో సాకారం చేయాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలదేనని స్పష్టం చేశారు. ప్రతి నిర్మాణ సంస్థ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు, నెలవారీ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. ఎంత మంది కార్మికులు, ఎంత యంత్ర సామగ్రి అవసరం, ప్రస్తుతం ఎంత వాడుతున్నారనే వివరాలను ఆరా తీశారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పూర్తి చేయాల్సిన పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యత, వ్యయ నియంత్రణ, గ్రీన్ ఎనర్జీ, ఆధునిక టెక్నాలజీ వినియోగం తప్పనిసరి అని స్పష్టం చేశారు. పనుల పూర్తి కోసం అవసరమైతే మానవ వనరులను పెంచుకోవాలని, ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రారంభించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## వైసీపీ దృష్టిలో అమరావతి శాసన రాజధాని మాత్రమే

అమరావతి రాజధాని విషయంలో వైసీపీ వైఖరిని బొత్స సత్యనారాయణ మరోసారి స్పష్టం చేశారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపినప్పటికీ... వైసీపీ మాత్రం తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. తాజాగా బొత్స మాట్లాడుతూ... అమరావతి తమకు కేవలం శాసన రాజధాని మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. తద్వారా 'మూడు రాజధానుల' విధానానికే తాము కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. కేవలం అమరావతి కోసమే రూ. 1.10 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. ఇంత భారీ మొత్తాన్ని ఒకే చోట వెచ్చించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము అమరావతికి వ్యతిరేకం కాదని, కేవలం రాజధాని అభివృద్ధి పేరుతో జరిగే అవినీతికి మాత్రమే వ్యతిరేకమని అన్నారు. అమరావతి ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం వేగంగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో తాము ప్రత్యామ్నాయ మార్గాల గురించి ఆలోచించాల్సి ఉంటుందని హెచ్చరించారు.గత వైసీపీ ప్రభుత్వం వికేంద్రీకరణ పేరుతో అమరావతి,

విశాఖపట్నం, కర్నూలులను మూడు రాజధానులుగా ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించేందుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత సాధించడంతో పాటు, పనులను వేగవంతం చేస్తోంది. ఈ క్రమంలో బొత్స చేసిన వ్యాఖ్యలు వైసీపీ తన పాత వైఖరికే కట్టుబడి ఉందనే సంకేతాలను ఇస్తున్నాయి.

## ప్రళయం విరుచుకుపడడానికి 48 గంటలే మిగిలి ఉంది

- మొదటి పేజి తరువాయి

వల్ల హార్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరిగాయి."ఇక ఆలస్యం కాకముందే ఓ ఒప్పందానికి రండి" అంటూ ట్రంప్ ఇరాన్‌కు సూచించారు. యుద్ధం నాలుగో వారానికి చేరిన నేపథ్యంలో, అవసరమైతే ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లపై కూడా దాడి చేస్తామని ట్రంప్ గతంలో బెదిరించారు. అంతేకాకుండా, హార్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికా తీసుకోదని, చమురు అవసరమైన దేశాలు తమ నౌకలను తామే రక్షించుకోవాలని లేదా అమెరికా నుంచి చమురు కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.ట్రంప్ హెచ్చరికలతో అంతర్జాతీయంగా

ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. యుద్ధం కారణంగా ఇప్పటికే దెబ్బతిన్న ఇరాన్ చమురు ఎగుమతులపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమరావతి అంటే అప్పు కాదు... 5 కోట్ల ఆంధ్రులకు అక్షయపాత్ర

- మొదటి పేజి తరువాయి

ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం నాడు అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్, వైసీపీ నేతల తీరును ఎండగట్టారు. తాడేపల్లి ప్యాలెస్ పెత్తందారుడి అవినీతిని కప్పిపుచ్చి, ఆ పాపాన్ని చంద్రబాబుకు అంటగట్టాలని సజ్జల రామకృష్ణారెడ్డి అండ్ కో ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

**రాజధానిపై వైసీపీలో గందరగోళం**

అమరావతి అంశాన్ని వైసీపీ నేతలు ఒక మ్యూజికల్ చైర్ గేమ్‌గా మార్చేశారని బుద్దా వెంకన్న విమర్శించారు. ఒకవైపు సజ్జల రామకృష్ణారెడ్డి అమరావతి వద్దు అంటుంటే, మరోవైపు బొత్స సత్యనారాయణ రాజధానిని పూర్తి చేయాలని అంటారని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి మూడు రాజధానులు, మెంటల్ గన్ అంటూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని, ఒక విధానమంటూ లేని పార్టీ వైసీపీ అని దుయ్యబట్టారు. అమరావతిపై విషం చిమ్మడం అంటే రాష్ట్ర యువత భవిష్యత్తుపై దాడి చేయడమేనని ఆయన హెచ్చరించారు.

**అమరావతి అప్పు కాదు.. రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్**

రాజధాని ఖర్చు ప్రజలపై పడుతుందంటూ సజ్జల చెబుతున్నది అతిపెద్ద డ్రామా అని వెంకన్న కొట్టిపారేశారు. "అమరావతి కోసం రైతులు ఇచ్చిన భూముల విలువ సుమారు రూ. 3 లక్షల కోట్లు. నాడు చంద్రబాబు హైదరాబాద్‌లో ఎకరం లక్ష రూపాయల భూమిని రూ. 150 కోట్లకు ఎలా చేర్చారో, అమరావతిని కూడా అదే స్థాయి గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడి మిగులు భూముల ద్వారా వచ్చే నిధులతో రాజధానిని నిర్మించడమే కాకుండా, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలను అభివృద్ధి చేయవచ్చు. ప్రభుత్వ నిధులతో పనిలేకుండా సంపద సృష్టించే మ్యాజిక్ అమరావతి సొంతం" అని ఆయన వివరించారు.

**భూకబ్జాలపై మాట్లాడేందుకు వైసీపీకు అర్హత లేదు**

భూముల గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీ నేతలకు లేదని బుద్దా వెంకన్న అన్నారు. చంద్రబాబు 500 ఎకరాలతో ఐటీ రంగాన్ని తెచ్చి 30 లక్షల ఉద్యోగాలు కల్పిస్తే, జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో 5.30 లక్షల ఎకరాల భూములను కబ్జా చేసి ఒక్క ఉద్యోగమైనా ఇవ్వలేదని ఆరోపించారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములు 8,000 ఎకరాలు, ఇడుపులపాయలో 600 ఎకరాల అసైన్డ్ భూములు, కడప, స్వర్ణముఖి ఫారెస్ట్ భూములను వైకాపా నేతలు కబ్జా చేశారని ఆయన ఆరోపణలు చేశారు. కబ్జా సంస్కృతి వైసీపీది అయితే, కల్పతరువు లాంటి అభివృద్ధి సంస్కృతి టీడీపీదని స్పష్టం చేశారు.

**నిర్మాణ ఖర్చులపై చర్చకు సిద్ధమా?**

జగన్ రెడ్డి తన విలాసం కోసం రుషికొండలో పర్యావరణాన్ని నాశనం చేసి, చదరపు అడుగుకు రూ.35,000 ఖర్చుతో రెండంతస్తుల

భవనం కట్టారని, అదే అమరావతిలో 50 అంతస్తుల భవనాన్ని చదరపు అడుగుకు కేవలం రూ.6,000తో నిర్మిస్తుంటే బురదజల్లుతారా అని ప్రశ్నించారు. రుషికొండ ప్యాలెస్, అమరావతి నిర్మాణ ఖర్చులపై చర్చకు వైకాపా నేతలు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు.

**రాజధానికి సంపూర్ణ చట్టబద్ధత**

ఇన్నాళ్లు రాజధానికి చట్టబద్ధత లేదని మాట్లాడటం వైసీపీ నేతల అవగాహనారాహిత్యానికి నిదర్శనమని వెంకన్న అన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులతో పాటు ఇప్పుడు పార్లమెంట్ చట్టం ద్వారా అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత లభించిందని తెలిపారు. ఇది పెట్టుబడిదారుల్లో కొండంత విశ్వాసాన్ని నింపిందని, 175 నియోజకవర్గాల యువతకు కల్పతరువుగా మారుతుందనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ప్రాంతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టే జగన్‌కు రాజకీయాల్లో ఉండే అర్హత లేదని, చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం జరిగి తీరుతుందని బుద్దా వెంకన్న ధీమా వ్యక్తం చేశారు.

## బీఆర్ నాయుడిని తొలగించాలని
# రోజా, భూమన డిమాండ్

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడును తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ నేతలు నిరసనలు ఉద్ధృతం చేశారు. అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రత్యేక పూజలు నిర్వహించి, కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తిరుమలలో అనేక వివాదాలు, అపశ్రుతులు చోటుచేసుకుంటున్నాయని భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ నాయుడు వ్యవహారశైలి వల్ల కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని మండిపడ్డారు. ఆయనను చైర్మన్ పదవి నుంచి తొలగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను లక్ష్యంగా చేసుకుని రోజా ఘాటు వ్యాఖ్యలు చేశారు. "బీఆర్ నాయుడుపై చర్యలు తీసుకోలేకపోవడం చంద్రబాబు చేతగానితనం. తమ వ్యక్తిగత విషయాలను ఎక్కడ బయటపెడతారో అని లోకేశ్, చంద్రబాబు భయపడుతున్నారా?" అని ప్రశ్నించారు. "లడ్డూ నెయ్యి విషయంలో ఏమీ లేకపోయినా మెట్లు కడిగిన పవన్ కల్యాణ్... ఇప్పుడు బీఆర్ నాయుడు వ్యవహారంలో ఎలాంటి 'ప్రోక్షణ' చేస్తారు? దీనిపై ఎందుకు స్పందించడం లేదు?" అని నిలదీశారు. లడ్డూ విషయంలో చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలని సిట్ నివేదికలో తేలిందని... కాబట్టి చంద్రబాబు అలిపిరి వద్ద సాష్టాంగ నమస్కారం చేసి హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## అమిత్ షా పర్యటనలో భద్రతా వైఫల్యం...

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటనలో భద్రతా వైఫల్యం, ఘర్షణ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేసింది. రెండు రోజుల క్రితం అమిత్ షా పశ్చిమ బెంగాల్‌లోని భవానీపూర్‌లో పర్యటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షోలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీనితో బీజేపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి నివేదిక ఇవ్వాలని బెంగాల్ ప్రధాన కార్యదర్శిని కోరింది. ఆయన నివేదిక సమర్పించడంతో దాని ఆధారంగా ఈసీ చర్యలు తీసుకుంది. అమిత్ షా పర్యటనలో అనేక భద్రతా వైఫల్యాలు ఉన్నట్లు గుర్తించింది. దీనికి బాధ్యులను చేస్తూ సిద్ధార్థ్ దత్తా అనే డీసీపీ సహా మరో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ ఈసీ నిర్ణయం తీసుకున్నది. అధికారులు శాంతిభద్రతలను కాపాడటంలో విఫలమయ్యారని పేర్కొంది.కాగా, భవానీపూర్ నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు. ఆమెపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సువేందు అధికారి బరిలోకి దిగారు. దీనితో ఈ నియోజకవర్గం కీలకంగా మారింది. ఇక్కడ మమతా బెనర్జీని ఓడించాలని బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది.

## ఆ సినిమాలపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది

ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్ష పార్టీలు 'ధురందర్', 'ది కేరళ స్టోరీ', 'ది కశ్మీర్ ఫైల్స్' వంటి సినిమాలతో పాటు పలు అంశాలపై ఉద్దేశపూర్వకంగా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని ఆయన బహిరంగంగా ఆరోపించారు. కేరళ ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఒక బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. "కాంగ్రెస్, యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ పార్టీలు ప్రతి విషయంలోనూ అబద్ధాలు చెబుతాయి. అది వారి నైజంగా మారింది. దేశాన్ని తప్పుదోవ పట్టించడమే వారి స్వభావం" అని అన్నారు. సినిమాల విషయంలోనూ ప్రతిపక్షాలు ఇదే తీరును ప్రదర్శిస్తున్నాయని ఆయన విమర్శించారు. "అబద్ధాలు చెప్పడంలో వారు నిపుణులు. 'ది కేరళ స్టోరీ' వచ్చినప్పుడు అదంతా అబద్ధం అన్నారు. 'ది కశ్మీర్ ఫైల్స్' వచ్చినప్పుడు కూడా అదే మాట అన్నారు. ఇప్పుడు 'ధురందర్' సినిమా విషయంలోనూ అబద్ధమని ప్రచారం చేస్తున్నారు" అని ప్రధాని పేర్కొన్నారు. గతంలో సీఏఏ చట్టం తెచ్చినప్పుడు కూడా దేశవ్యాప్తంగా ఎన్నో అబద్ధాలు ప్రచారం చేశారని, కానీ ఇప్పుడు ఆ చట్టం అమల్లోకి వచ్చినా దేశానికి ఎలాంటి నష్టం జరగలేదని మోదీ గుర్తుచేశారు. "యూసీసీ, ఎఫ్‌సీఆర్ఏ వంటి అంశాల్లోనూ వారు అవే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. గోవాలో దశాబ్దాలుగా యూసీసీ అమల్లో ఉంది. అబద్ధాలు వ్యాప్తి చేయడమే వారి వ్యాపారం" అని ప్రధాని మోదీ తీవ్రంగా విమర్శించారు.ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురందర్', వివేక్ అగ్నిహోత్రి రూపొందించిన 'ది కశ్మీర్ ఫైల్స్', సుదీప్తో సేన్ డైరెక్ట్ చేసిన 'ది కేరళ స్టోరీ' చిత్రాలు వాటి కథావస్తువుల కారణంగా రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. జాతీయ భద్రత, కశ్మీరీ పండిట్ల వలస, కేరళ యువతుల ఉగ్రవాద రిక్రూట్‌మెంట్ వంటి అంశాలపై ఈ సినిమాలు తెరకెక్కాయి.

## ఆయనకు మనం ఎప్పుడూ అండగా ఉండాలి

- మొదటి పేజి తరువాయి

ఎప్పుడూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.కర్ణాటకలోని సింధనూరు హోసళ్లీ క్యాంపులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్‌ను శనివారం లోకేశ్ ప్రారంభించారు. కేంద్ర మంత్రి కుమారస్వామి, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ ప్రసంగించారు. కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఆయన కొనియాడారు. దేశం కోసం సైనికులు చేస్తున్న ప్రాణత్యాగాలను ఎప్పటికీ మర్చిపోకూడదని అన్నారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.

## గీత దాటితే సస్పెన్షన్ తప్పదు

- మొదటి పేజి తరువాయి

మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత కార్యాలయాల నుంచి ఫోన్లు వచ్చినా ఎమ్మెల్యే తన పంతం వీడకపోవడం చర్చనీయాంశమైంది.

ఈ వ్యవహారంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. "వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ గౌరవాన్ని పణంగా పెట్టేది లేదు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే పునరాలోచన లేకుండా సస్పెండ్ చేస్తా. రాజకీయాల్లో సుదీర్ఘ కాలం ఉండాలనుకుంటున్నారా? లేక ఒక్కసారే ఎమ్మెల్యేలుగా మిగిలిపోవాలనుకుంటున్నారా? మీరే తేల్చుకోవాలి" అంటూ వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తేవడం, కార్యాలయాల్లో బైఠాయించడం వంటి చర్యలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయని, ఇలాంటి వాటిని భరించే ప్రసక్తే లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఇరాన్‌పై ఆగని దాడులు.. శాశ్వత పరిష్కారం కావాలన్న అబ్బాస్ అరాఘ్చీ

- మొదటి పేజి తరువాయి

లక్ష్యమని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ శనివారం స్పష్టం చేశారు. అమెరికా మీడియా తమ వైఖరిని తప్పుగా చిత్రీకరిస్తోందని ఆయన ఆరోపించారు.పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇస్లామాబాద్‌లో అమెరికా అధికారులతో జరిగే చర్చలకు ఇరాన్ హాజరుకావడం లేదని వాల్ స్ట్రీట్ జర్నల్ కథనాన్ని ప్రచురించింది. ఈ కథనాన్ని ఖండిస్తూ అరాఘ్చీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో ఒక ప్రకటన విడుదల చేశారు. "చర్చల కోసం ఇస్లామాబాద్ వెళ్లడానికి మేము ఎప్పుడూ నిరాకరించలేదు. మధ్యవర్తిత్వ ప్రయత్నాల కోసం పాకిస్థాన్‌కు మేం కృతజ్ఞతలు తెలుపుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు.ఈ ఏడాది ఫిబ్రవరి 28న టెహ్రాన్‌తో పాటు ఇతర ఇరాన్ నగరాలపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేయడంతో ఈ వివాదం మొదలైంది. ఈ దాడుల్లో ఇరాన్ అత్యున్నత నాయకుడు అలీ ఖొమైనీ మరణించారు. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్, మధ్యప్రాచ్యంలోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తోంది."మాపై రుద్దిన ఈ చట్టవిరుద్ధమైన యుద్ధానికి శాశ్వతమైన, నిశ్చయాత్మకమైన ముగింపు పలికే నిబంధనలే మాకు ముఖ్యం" అని అరాఘ్చీ తన ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణ కన్నా, యుద్ధాన్ని పూర్తిగా ఆపే ఒప్పందంపైనే తమ దృష్టి ఉందని ఆయన పరోక్షంగా తేల్చిచెప్పారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులను పర్యవేక్షించిన కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఏప్రిల్ 4:** పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కమ్యూనిటీ హాల్ లో వసతులను కల్పించాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. శనివారం ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన పర్యటించారు. 18వ వార్డు కొండా వారి వీధిలో రూ. 10 లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో పనులను చేపట్టాలని, త్వరగా భవనాన్ని వినియోగంలోకి తీసుకురావలసిందిగా ఆదేశించారు. ఆయన వెంట ఈఈ మాధవి, ఎంహెచ్ఓ వినూత్న, ఇతర సిబ్బంది ఉన్నారు.

## అమరావతి ఒక్కటే రాజధాని బిల్లు ఆమోదం... టీడీపీ నాయకుల సంబరాలు



**గంగవరం, పెన్ పవర్, ఏప్రిల్ 4:** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం జడేరు గ్రామంలో అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏకైక రాజధానిగా ప్రకటించే బిల్లు చట్టసభల్లో, పార్లమెంట్‌లో ఆమోదం పొందిన సందర్భంగా టీడీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు రైతు నాయకులు కనిగిరి రాంబాబు నివాసం వద్ద పార్టీ నాయకులు దీపాలు వెలిగించి ఆనందం వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రతినిధి కనిగిరి రాంబాబు, బూత్ కన్వీనర్ పల్లాల వీరభద్రారెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కనిగిరి సుభాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కనిగిరి నాని, సీనియర్ కార్యకర్తలు బైరా కృష్ణ, చెక్కా రాజారెడ్డి, గోనెల విజయబాబు, అల్లం రమణమ్మతో పాటు కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.



## రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్డీవో కె.ఆనందరావు

**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 4:** రీ సర్వే ప్రాజెక్ట్ 4 లో భాగంగా తాళ్లపూడి మండలంలో ఎంపిక కాబడిన మలకపల్లి, పెద్దేవం గ్రామాల్లో జరుగుతున్నటువంటి ప్రక్రియ పరిశీలనలో భాగంగా రీ సర్వే పై శనివారం మలకపల్లి గ్రామం విచ్చేసి రీ సర్వే ప్రక్రియను కొవ్వూరు ఆర్డీవో కె.ఆనందరావు పరిశీలించారు. రైతులు వారికి గల పొలాల సరిహద్దులు స్వయంగా చూపించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. భూమి హెచ్చు తగ్గుల సమస్యలపై రైతులు సరిజేయటం జరగటం లేదని తెలుపగా గతంలో కంటే మెరుగ్గా ఈ సర్వే ప్రభుత్వం నిర్వహిస్తుందని, ప్రతి అర్జీ పరిశీలించి గ్రామ సర్వేయర్లు భూమి కొలిచి రైతులకు హద్దులు చూపించటం జరుగుతుందని తెలియజేశారు. రికార్డు పబ్లికేషన్ సమయంలో రైతులందరూ వారి గల భూమి విస్తీర్ణం నమోదులు సరిచూసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ లక్ష్మీ లావణ్య, సర్వేయర్ సత్యనారాయణ, గ్రామ సర్వేయర్లు, విఆర్ఓ లు ప్రకాష్, ప్రవీణ్, రైతులు మద్దిపాటి రామారావు, కాకర్ల గోపాలకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## చింతూరులో బీజేపీ శిక్షణాభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహణ

**చింతూరు, పెన్ పవర్ ఏప్రిల్ 4:** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమం భాగంగా శనివారం చింతూరు మండలంలోని ఎర్రంపేట గ్రామ పరిధిలో విస్తృత స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల సామర్థ్యాభివృద్ధి, సిద్ధాంతాల పట్ల అవగాహన పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెనుమాక రవికుమార్ హాజరై మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో బీజేపీ పాత్రను వివరించారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. సేవా భావంతో ప్రజల మధ్య పనిచేసే కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు. జిల్లా వర్గ ప్రముఖ కుంజ సత్యనారాయణమ్మ మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం పార్టీ అభివృద్ధికి కీలకమని చెప్పారు. మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కురుస ఉమామహేశ్వరావు మహిళలు రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గిరిజన మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్ట సుప్రజ గిరిజన ప్రాంతాల్లో పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని సూచించారు. ఓబీసీ ప్రధాన కార్యదర్శి కొమ్ము జి. ఈశ్వరావు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై వివరించారు. మండల ట్రెజరర్ అప్పాజీ శివాజీ, నాయకులు తమ్మినేడి రామారావు, కుప్పుసామి షణ్ముఖ, బట్ట రామారావు తదితరులు కూడా కార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిక్షణలో పార్టీ చరిత్ర, సిద్ధాంతాలు, కార్యాచరణ విధానం, భవిష్యత్ వ్యూహాలు వంటి అంశాలపై నాయకులు కార్యకర్తలకు సవివరంగా అవగాహన కల్పించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు బట్ట లక్ష్మయ్య రాజు ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహించగా, చింతూరు మండలానికి చెందిన పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐకు ఘన స్వాగతం



**చింతూరు, పెన్ పవర్ ఏప్రిల్ 4:** చింతూరు పోలీస్ స్టేషన్‌కు నూతనంగా ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సంతోష్ కుమార్‌ను శనివారం చింతూరు డా. బి.ఆర్. అంబేద్కర్ కుటుంబ సంక్షేమ సంఘం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, చింతూరు ప్రాంతంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం కావాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని కోరారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సంతోష్ కుమార్ తన పదవీకాలంలో ప్రజలకు న్యాయం చేస్తూ, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, పోలీస్ ప్రజల మధ్య అనుసంధానం పెంపొందించడంలో తమ సంఘం సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు పాల్గొని, శుభాకాంక్షలు తెలియజేశారు.

## హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపికైన చిట్యాల కు చెందిన లోకి ప్రకాష్



**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 4.** మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన బొనిగే లోకి ప్రకాష్ రాష్ట్ర అత్యుత్తన్నత న్యాయస్థానానికి సివిల్ జూనియర్ న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగాప్రకాష్ ను ప్రగతి అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బేతాళ వీరాస్వామి ఆదేశాలు మేరకు సంస్థ సభ్యులు శనివారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఆయనస్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొవ్వూరులోని ప్రైవేట్ పాఠశాలలో విద్యను అభ్యసించారు, అనంతరం ఆంధ్ర యూనివర్సిటీలో బీఏ ఎల్ ఎల్ బి పూర్తి చేశారు. నన్నయ యూనివర్సిటీలో ఎల్ ఎల్ ఎం చదివారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జరిగిన ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల తో పాటు ముఖాముఖిలోవిజయ సాధించారు. ఏప్రిల్ 2వ తేదీన విడుదల చేసిన ఫలితాల్లో ప్రకాష్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు. తన మాతృమూర్తి బొనిగే గంగారత్నం ఆశయం మేరకు తాను న్యాయ వ్యవస్థలోకి వచ్చినట్లు ప్రకాష్ తెలిపారు. ఇది ఎలా ఉంటే ఆయన తండ్రి బొనిగే వెంకట్రావు కొవ్వూరు రెండో తరగతి అదనపు న్యాయ స్థానంలో న్యాయ మూర్తిగా పనిచేస్తున్నారు. వెంకట్రావు కుమార్తె సోఫియా సైతం ఆంధ్ర యూనివర్సిటీలో బి ఏ ఎల్ ఎల్ బి పూర్తి చేశారు. మీరు కుటుంబం మొత్తం న్యాయస్థానాలకు సంబంధించిన చదువులు చదవడం విశేషం. ఈ కార్యక్రమంలో హార్ట్ ఇండియా స్వచ్ఛంద సేవసంస్థ సభ్యులు దొడ్డిగర్ల వెంకటేష్, చింతలపూడి భాస్కరరావు, వింజమూరి సుబ్బారావు, మోసాల కొండలరావు, పాముల తిరుపతయ్య, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రెవెన్యూ సేవల్లో పారదర్శకతే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**గంగవరం/ రాజవొమ్మంగి పెన్ పవర్, ఏప్రిల్ 4:** రైతుల భూ-ఆస్తుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. శనివారం రాజవొమ్మంగి మండలం పాకవెల్తి గ్రామంలో నిర్వహించిన "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె, గత ప్రభుత్వ కాలంలో పట్టాదారు పాసుపుస్తకాలపై వ్యక్తిగత ఫోటోలు ముద్రించడం అనుచితమని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతుల హక్కులను కాపాడేందుకు రీ-సర్వే నిర్వహించి, పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ రాజముద్రతో ఈ-పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో 34 మంది రైతులకు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. భూముల వివరాల్లో ఎలాంటి పొరపాట్లు ఉన్నా వెంటనే సరిచేసి రైతులకు అందించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఇంకా రీ-సర్వే పూర్తి కాని గ్రామాల్లో సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిందని, రైతులు దానిని వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 4.92 లక్షలతో మరమ్మత్తు పనులు చేపడతామని తెలిపారు.



### ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం అస్సలు వద్దు.

అనంతరం లోదొడ్డి గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలు సమర్పించే ప్రతి సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. సమస్యలు పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, తమ పరిధిలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. పరిష్కారం సాధ్యం కానప్పుడు కారణాలు



స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ప్రజా దర్బార్‌లో దరఖాస్తులు సమర్పించే వారు ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు, ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఏ ఎం సి చైర్మన్ లోతా లక్ష్మణరావు, సొసైటీ అధ్యక్షుడు ముప్పన కేశవ్, మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, మాజీ ఎంపీపీ రెడ్డి రమణ, సీనియర్ నాయకులు గణజాల తాతారావు తదితరులు, అలాగే తహసీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పెంపుకు 100 రోజుల మహా ప్రణాళిక



* నీటి భద్రతలో సాగునీటి సంఘాలే కీలకం:
* జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఏప్రిల్ 4:**పోలవరం జిల్లాలో భూగర్భ జలాల పునరుజ్జీవనం, నీటి భద్రత సాధనలో సాగునీటి సంఘాలు కీలక పాత్ర పోషించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ జారీ చేసిన జీవో నెం.10 మేరకు, ఏప్రిల్ 6 నుంచి జూలై 14 వరకు 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. భూగర్భ జల మట్టాలను పెంపొందించడం, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలుగా ఆయన వెల్లడించారు. శాస్త్రీయ విధానాలు, బేసిన్ ఆధారిత ప్రణాళికలు, సమాజ భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు.కార్యక్రమాన్ని దశలవారీగా అమలు చేస్తామని పేర్కొంటూ, మొదటి 10 రోజులు కార్యాచరణ గుర్తింపు, తదుపరి 5 రోజులు మంజూరు ప్రక్రియ, 80 రోజులు పనుల అమలు, చివరి 5 రోజులు నివేదికలు, డాక్యుమెంటేషన్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఏప్రిల్ 16 నుంచి జూలై 9 వరకు పనులు కొనసాగగా, జూలై 10 నుంచి 14 వరకు నివేదికల ప్రక్రియ చేపడతామని తెలిపారు.

జిల్లాలోని 8 మండలాల్లో 53 సాగునీటి సంఘాలు ఉండగా, ఇప్పటికే 49 సంఘాలకు ఎన్నికలు పూర్తయ్యాయని, మిగిలిన 4 సంఘాలకు త్వరితగతిన ఎన్నికలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ సభల ద్వారా నీటి సంరక్షణపై తీర్మానాలు చేయించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.రైతులకు సాగునీరు సమృద్ధిగా అందేలా కాలువల ద్వారా సమానంగా పంపిణీ జరగాలని, నీటి వృథాను అరికట్టాలని ఆయన పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో నీటి వనరుల సంరక్షణ, నిర్వహణలో సాగునీటి సంఘాల బాధ్యత మరింత కీలకమని అన్నారు. సాగునీటికి సంబంధించిన సమస్యలను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఏపీవో జనరల్ డి.ఎన్.వి. రమణ, విబిజి రామ్ జి, ఏపిడి టి. శ్రీనివాస విశ్వనాథ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రామ్మోహన్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి. దేవదానం, డీఎల్పీఓ రామకృష్ణ, వ్యవసాయ శాఖ ఏడీఏలు కే. సావిత్రి, హిమబిందు, గ్రామీణ నీటిపారుదల శాఖ ఇంజనీర్లు సుబ్బారావు, శివ, ఎస్ఎంఐ ఏఈ హరి, ఎస్ఓ మార్తమ్మతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు శిక్షణ ఎంతో దోహదం





జడ్పీటీసీ సభ్యురాలు ఏ. బేబీ రత్నం

**గంగవరం ,పెన్ పవర్, ఏప్రిల్ 4:**ఏజెన్సీ ప్రాంత మహిళల సాధికారతకు కుట్టు శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జడ్పీటీసీ సభ్యురాలు, గిరి కిరణం ఆగ్రో ఫారెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఏ. బేబీ రత్నం అన్నారు. శనివారం మండల కేంద్రంలో గిరి కిరణం ఆగ్రో ఫారెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసిన 100 మంది మహిళలకు సబ్సిడీపై కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సంస్థ పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. మండలంలో ప్రస్తుతం 22 గ్రూపులలో 446 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారని, వీరిలో 100 మందికి కుట్టు మిషన్లు అందించామని వివరించారు. ఈ శిక్షణ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆమె పేర్కొన్నారు.అనంతరం సంస్థ చైర్మన్ వెంకటరమణ మాట్లాడుతూ అనకాపల్లి, పాడేరు, పోలవరం జిల్లాల్లో సుమారు 5000 మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కొత్త శిక్షణా కేంద్రాల్లో 32 మంది ట్రైనర్లను నియమించి మహిళలకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం అప్పలకొండ, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పండ సిద్ధార్థ దొర, జనసేన మండల అధ్యక్షుడు కుంజం సిద్దు తదితరులు పాల్గొని ప్రసంగించారు. గిరి కిరణం సంస్థ అందిస్తున్న సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా ట్రైబల్ ఫుట్ బాల్ లో మెరిసిన గిరిజన కుసుమాలు



**వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్, ఏప్రిల్ 4 :** ఆల్ ఇండియా లెవెల్ లో ఖేలో ఇండియా ట్రైబల్ ఫుట్ బాల్ లో గిరిజన విద్యార్థినిలు సత్తా చాటారని ఫిజికల్ డైరెక్టర్ ఆర్ కొండబాబు తెలిపారు.

గుర్తేడు మండలం దార గడ్డ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల గిరిజన విద్యార్థినులు వెలుగూరి విజయ, కొర్ర పరిమిల జాతీయస్థాయిలో ఎంపిక కావడం గర్వకారణం అని అన్నారు. మార్చి 26వ తేదీ నుండి ఏప్రియల్ మూడవ తేదీ వరకు రాయపూర్,చత్తీస్గడ్ లలో జరిగినటువంటి ఖేలో ఇండియా ట్రైబల్ నేషనల్ ఫుట్బాల్ గేమ్స్ లో వీరు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి దేవి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి జాతీయ స్థాయికి గిరిజన విద్యార్థినులు ఎదగడం గర్వకారణం అని అన్నారు. రాబోయే జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించాలని ఆశిస్తున్నట్లు ఆమె తెలిపారు. జాతీయస్థాయిలో గిరిజన విద్యార్థినులు ఎంపిక కావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ గా వ్యవహరించిన రోలుపల్లి కొండబాబు, గబుడు చంద్రశేఖర్ నాయుడు, తోటి విద్యార్థులు అభినందించారు.

## గ్రామాభివృద్ధికి సమిష్టిగా సహకరించాలి





డిప్యూటీ ఎంపీడీఓ గోపన్నదొర

**గంగవరం, పెన్ పవర్, ఏప్రిల్ 4:** గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని డిప్యూటీ.ఎంపీడీఓ గోపన్నదొర పేర్కొన్నారు. శనివారం గంగవరం మండలం మొల్లేరు గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరభద్రరావు, సిబ్బంది వీరబాబు, స్థానిక నాయకులు, మాజీ సర్పంచ్ లక్ష్మి పాల్గొని గోపన్నదొరకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని వారు ఆకాంక్షించారు.స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన గోపన్నదొర గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు.

## ఇన్చార్జ్ ఆదేశాలు ప్రకారమే పార్టీని ముందుకు తీసుకువెళుతున్నాం.



వైఎస్ఆర్ రాష్ట్ర కార్యదర్శి గుల్లా ఏడుకొండలు

**గోకవరం పెన్ పవర్ ఏప్రియల్ 04:-** రాష్ట్రంలో హిందూ ధర్మం, మహిళలపై దాడులు, డ్రగ్స్ నేను ఇష్టమున ఈ నియోగించిన ప్రజాప్రతినిధులు, అబద్ధపు ప్రకటనలు ఇలా ఎన్నో ప్రజా వ్యతిరేక పరిపాలన జరుగుతున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కనీసం స్పందించడం లేదని అసలు గోకవరం మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉందా లేదా అంటూ మీడియా సభ్యులు అడిగిన ప్రశ్నలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుల్లా ఏడుకొండల స్పందించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదిష్టానం తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడుని తొలగించాలని రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా గోకవరం మండల పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ప్రత్యేక నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడారు అనంతరం మీడియా సభ్యులు అడిగిన ప్రశ్నకు రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గుల్లా ఏడుకొండలు బదిలీస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉంటుందని నియోజవర్గ ఇన్చార్జి మాజీ మంత్రివర్యులు తోట నరసింహం గారి ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు మా కార్యక్రమాలు మేము చేస్తూ వెళుతున్నామని ఒక్కొక్కసారి నియోజకవర్గ స్థాయిలోనూ ఒక్కొక్కసారి జిల్లా స్థాయిలోనూ కార్యక్రమాలు చేయడం తప్పనిసరి కారణంగా మండల స్థాయిలో లోటు ఉందని అంగీకరిస్తూ భవిష్యత్తులో ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని ప్రజా సమస్యల మీడియా దృష్టికి ఏవైనా వచ్చిన తక్షణం తన చేరవేయాలంటూ కోరారు. తిరుపతి లడ్డులో కల్తీ జరిగిందని మీ పార్టీ నాయకుడు మండలంలోని పుణ్యక్షేత్రమైన తంటికొండ దేవస్థానం మెట్లు కడిగారు కదా మరి మీ పార్టీ తరఫున మీరు ఒప్పుకున్నట్లు కదా అని అడిగిన ఒక ప్రశ్నకు రాష్ట్ర పార్టీ కార్యదర్శి గుల్లా ఏడుకొండలు స్పందిస్తూ ఈ విషయం నాకు తెలియదని మండలంలోని పార్టీ అధ్యక్షుడు మండల పరిషత్ అధ్యక్షుడు ఇలా ముఖ్యమైన నేతలు అంతా కూర్చుని చర్చించుకుని మా ఇన్చార్జి దృష్టిలో పెట్టి అవసరం అయితే చర్యలు తీసుకోవడం కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు.

## గిరిజన గురుకులాలు, ఏకలవ్య ఎంట్రన్స్ పరీక్షలు ప్రశాంతంగా పూర్తి



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 4:**పోలవరం జిల్లాలో గిరిజన సంక్షేమ గురుకులాలు మరియు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రవేశ పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా నిర్వహించబడ్డాయి. జిల్లా కేంద్రంగా ఆరు పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు మంచి స్పందన లభించింది.5వ తరగతికి 630 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 567 మంది హాజరై 63 మంది గైర్హాజరయ్యారు. అలాగే 6వ తరగతి ఏకలవ్య పాఠశాలల ప్రవేశానికి 1318 మంది అప్లికేషన్లు రాగా, 1199 మంది హాజరై 119 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.పరీక్షలను ఓఎంఆర్ విధానంలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహించారు. రంపచోడవరం, చింతూరు ప్రాంతాల్లో రెండు చొప్పున కేంద్రాలు, అడ్డతీగలలో ఒక కేంద్రంతో మొత్తం ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు.గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీఏ రంపచోడవరం ఉపసంచాలకులు ఎం. రుక్మాంగదయ్య తెలిపిన వివరాల ప్రకారం, విద్యార్థులకు తాగునీరు, అల్పాహారం, వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు పరీక్షల నిర్వహణకు 72 మంది ఇన్విజిలేటర్లు, 6 మంది ప్రత్యేక అధికారులు, 6 మంది విభాగాధిపతులు, ఒక రాష్ట్ర స్థాయి పరిశీలకుడు విధులు నిర్వర్తించారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా పూర్తయ్యాయని ఆయన పేర్కొన్నారు.

## నీరులేని నీటి తొట్టెలు

* మూగజీవాల దాహార్తి తీరేదెలా?



**వై రామవరం, పెన్ పవర్, ఏప్రిల్ 4 :** మూగజీవాల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో గతంలో నిర్మించిన నీటి తొట్టెలు నీరు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయని స్థానికుల ఆరోపిస్తున్నారు.

వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో అనుకూలమైన ప్రదేశాలలో నీటి తొట్టెలను ప్రజా ధనంతో నిర్మించారని స్థానికుల అంటున్నారు. నిర్మించిన తొలి సంవత్సరంలోనే నీతి తోట్టెల్లో నీరు ఉండేదని, నిర్వహణ లోపం కారణంగా వేసవికాలంలో కూడా నీటి తొట్టెలలో నీరు నింపే నాధుడే కరువయ్యాడని అంటున్నారు. ఈ నీటి తోటలను గతంలో పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహించేవారు అని, ప్రస్తుతం సచివాలయం వ్యవస్థ వచ్చిన తర్వాత నీటి తొట్టెల నిర్వహణ గాలికి వదిలేసారని స్థానికుల ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ వేసవికాలంలోనైనా నీటి తొట్టెలలో మూగజీవన దాహార్తి తీర్చేందుకు నీటిని నింపవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయా గ్రామస్తులు కోరుచున్నారు.

## ఆరు పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన అడ్డతీగల ఎంపీడీవో కుమార్...



**అడ్డతీగల, పెన్ పవర్, ఏప్రియల్ 04:** అడ్డతీగల మండలం లో6 పంచాయతీ ల ప్రత్యేక అధికారిగా అడ్డతీగల ఎంపీడీవో కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.అడ్డతీగల, కొనలోవ, రాయపల్లి, తిమ్మాపురం, బొడ్లంక, తుంగమడుగుల ఈ ఆరు గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సంబంధిత పంచాయతీ అభివృద్ధి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, రానున్న వేసవి కాలంలో తాగు నీటికి ఎద్దడి లేకుండా రక్షిత తాగునీటి పథకాలు , చేతి పంపులు సక్రమంగా పని చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని, ఆరు పంచాయతీల సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీలలో ప్రధాన కూడలి లో చలివేంద్రములును ఏర్పాటు చేయవలసినదిగా పంచాయతీ ప్రత్యేక అధికారి ఎంపీడీవో కుమార్ ఆదేశించారు. అలాగే గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు ప్రతిరోజూ నిర్వహించి, అలాగే గ్రామ పంచాయతీలో ప్రజలకు ఏ రకమైన ఇబ్బందులు మరియు సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవలసినదిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ప్రజలకు ఏ సమస్య ఉన్న తనను నేరుగా సంప్రదించి తెలియజేయవలసిందిగా పంచాయతీ ప్రత్యేక అధికారి కుమార్ తెలిపారు.

## పవన్ కళ్యాణ్ కు సనాతన ధర్మం గుర్తుకురావాలి

* టీటీడీ చైర్మన్ పై చర్యలు తీసుకోవాలని గుడిలో పూజలు





**గోకవరం పెన్ పవర్ ఏప్రియల్ 04:-**సనాతన ధర్మం, హిందూ ధర్మం అంటున్న జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు విషయంలో ఎందుకు సనాతన ధర్మం గుర్తుకు రావడం లేదంటూ, బి ఆర్ నాయుడుని పదవి నుండి తప్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మంచి బుద్ధిని ప్రసాదించాలని గోకవరం మండల వైఎస్ఆర్సిపి నాయకులు శనివారం వెంకటేశ్వర స్వామి గుడిలో పూజలు నిర్వహించారు. ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ ఉన్న ఒక వీడియో పై వైసిపి నాయకులు స్పందించారు. గుడిలో పూజలు నిర్వహించిన అనంతరం, స్థానిక ప్రెస్ క్లబ్ నందు పాత్రికేయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గుల్లా ఏడుకొండలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నెయ్యి కల్తీ జరగలేదని లేదని, సాక్షాత్తు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ప్రస్తుత టిటిడి చైర్మన్ ఒక మహిళతో అత్యంత సన్నిహితంగా ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వస్తున్నప్పటికీ ఎందుకు చర్యలు తీసు కోవడం లేదని ప్రశ్నించారు. జనసేన పార్టీకి చెందిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై ఒక మహిళ స్వయంగా ఫిర్యాదు చేసినప్పటికీ జనసేన నాయకుడు మాత్రం స్పందించకపోవడం దారుణం అన్నారు. రాష్ట్రంలో మహిళలు,దళితులుపై జరుగుతున్న దాడులకు బాధ్యత వహించి హోం మంత్రి అనిత రాజీనామా చేయాలన్నారు. మచిలీపట్నం నుండి గుంటూరు వరకు 110 కిలోమీటర్ల జాతీయ రహదారి ఉన్న ఈ ప్రాంతాన్ని రాజధాని ప్రాంతంగా పరిగణించాలాన్నారు. లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినప్పటికీ, రాజధాని పనులు ఎప్పటికీ పూర్తి అవుతాయో తెలియని పరిస్థితి లో ఉన్నామన్నారు. పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గంలో మహిళను లాటితో కొట్టినప్పటికి ఆయన స్పందించరని, రాష్ట్రంలో దారుణమైన పరిపాలన కొనసాగుతుందని అన్నారు. గత వైసిపి హయంలో చిన్న ఆడియో టేప్ వచ్చిన కారణంగానే అప్పటి ఎస్ వి బి సి భక్తి ఛానెల్ చైర్మన్ పదవి నుండి పృథ్వీరాజ్ ను తొలగించి జగన్మోహన్ రెడ్డి హిందూ ధర్మంపై తనకున్న మక్కువను చాటుకున్నారని అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి టిటిడి చైర్మన్ పై చర్యలు తీసుకునే విధంగా బుద్ధుని ప్రసాదించాలని తాము వెంకటేశ్వరస్వామిని కోరుకున్నామని అన్నారు. స్థానిక వైసీపీ నాయకులు తోలేటి రాంప్రసాద్, నరాలశెట్టి నరసయ్య, బూల అబ్బులు,అంబటి అబ్రహం తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## మీ భూమి -- మీ హక్కు కార్యక్రమంలో గిరిజన రైతులకు పట్టాల పంపిణీ





**గంగవరం, పెన్ పవర్ ఏప్రిల్ 4:** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం జడేరు పంచాయితీ పరిధిలోని చీడిపాలెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమం కింద గిరిజన రైతులకు రాజముద్రతో కూడిన భూమి పట్టాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన రైతులకు ప్రతి నెలా పట్టాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. చీడిపాలెం గ్రామంలో మొత్తం 84 మంది గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇంకా రీ సర్వే పూర్తి కాని భూములను వేగవంతంగా సర్వే చేసి, అర్హులైన రైతులకు కొత్త పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.రీ సర్వే పూర్తైన భూముల వివరాలను సక్రమంగా నమోదు చేసి, రైతులకు పారదర్శకంగా హక్కులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడకం వెంకటరమణ, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, పీసా ఉపాధ్యక్షులు మడకం శివ, సత్యనారాయణ, ఆర్ఐ లక్ష్మణరావు, వీఆర్వో సారపు వెంకన్నదొర, వీఆర్ఏ ప్రకాష్, గ్రామ పెద్దలు, పట్టా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ చైర్మన్ పదవి నుంచి బి ఆర్ నాయుడు ను ప్రభుత్వం తొలంగించాలి




* నగర వైసీపీ ఆధ్వర్యంలో
* శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిరసన

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 4:** ఆది దేవుడు శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ చైర్మన్ బి ఆర్ నాయుడును సీఎం చంద్రబాబు నాయుడు పదవి నుంచి తొలగించాలని, తిరుమల పవిత్రతను, హిందూ భక్తుల మనోభావాలను కాపాడాలని ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షుడు , వైసిపి కార్మిక నాయకుడు వాసంశెట్టి గంగాధరరావు డిమాండ్ చేశారు. పవిత్రమైన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ గా ఉంటూ అసభ్య కార్యకలాపాల్లో మునిగితేలుతూ, హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీసిన చైర్మన్ నాయుడు అసభ్యకర ప్రవర్తన ను నిరసిస్తూ వై సిపి నగర విభాగాల శ్రేణులు స్థానిక దేవి చౌక్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వాసంశెట్టి గంగాధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్రమైన ఆది దేవుడి ప్రాంగణాన్ని అపవిత్రం చేసిన బి ఆర్ బి ఆర్ నాయుడు ను శిక్షించాలని, ఆ దేవదేవుడే తగిన చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు కూటమి ప్రభుత్వ పెద్దలకు జ్ఞానోదయం కలిగించాలని పూజలు చేశారు. తిరుమల దేవస్థానం పవిత్రతను కాపాడాలని, పవిత్రతను దెబ్బతీసిన బిఆర్ నాయుడు ను బర్తరఫ్ చేయాలని, హిందూ భక్తుల మనోభావాలను కాపాడాలని, కూటమి ప్రభుత్వ పాలన సిగ్గు, సిగ్గు

ప్ల కార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మీడియాతో వాసంశెట్టి మాట్లాడుతూ , పవిత్రమైన ఆదిదేవుడు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చైర్మన్ గా ఉంటూ అసభ్యకరమైన వీడియోలతో దొరికిపోయిన బిఆర్ నాయుడు హిందూ మనోభావాలను దెబ్బతీశాడన్నారు. ప్రత్యక్షంగా దొరికి పోయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనను పదవి నుంచి తొలగించకపోగా, ఇంకా ఆయనను కొనసాగించడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు. మంత్రి చంద్రబాబు నాయుడు ఆయన పట్ల పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని వాసంశెట్టి ఆరోపించారు. మంత్రి చంద్రబాబు నాయుడు కు చిత్తశుద్ధి ఉంటే బిఆర్ నాయుడు ను పదవి నుంచి తొలగించాలని , తొలగించక పోతే వైసిపి శ్రేణులు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, మహిళలు , కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆత్మహత్యాయత్నం చేసిన మహిళను కాపాడిన జిల్లా పోలీసు శక్తి టీం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 4** ఈనెల మూడవ తేదీన సాయంత్రం పుష్కర్ ఘాట్ వద్ద శక్తి టీంలు పెట్రోలింగ్ చేస్తూ శక్తి యాప్స్ డౌన్లోడ్ చేస్తూ ఉండగా, కొంతమంది పుష్కర్ ఘాట్ లో ఒక మహిళ ఆత్మహత్య ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. వెంటనే స్పందించిన జిల్లా పోలీసు శక్తి టీం సభ్యులు ఆ ప్రదేశం వద్దకు వెళ్లి ఆమెను కాపాడి పైకి తీసుకుని వచ్చారు. ఆమెను వివరాలను అడుగగా తనది కోనసీమ జిల్లా , అయినవిల్లి మండలము,కాప చింతలపూడి గ్రామమని, తన భర్తతో గొడవల వల్ల చనిపోవడానికి వచ్చినట్లు తెలిపింది.

వెంటనే ఆమెను మహిళా పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకుని వచ్చి తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి, ఆమె బంధువులకు అప్ప చెప్పడం జరిగిందని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మంగాదేవి తెలిపారు.

## నైతిక విలువలతో టీటీడీ చైర్మన్ పదవికి బి ఆర్ నాయుడు రాజీనామా చేయాలి



* రూరల్ వైసీపీ శ్రేణుల ఆధ్వర్యంలో
* శ్రీ కనకదుర్గమ్మ ఆలయం లో చెల్లు బోయిన పూజలు


**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 4:** ప్రపంచవ్యాప్తంగా హిందువులకు ఆది దేవుడు శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ చైర్మన్ బి ఆర్ నాయుడు నైతిక విలువలతో పదవికి రాజీనామా చేయాలని వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ డిమాండు చేశారు. ఆయన అసభ్య ప్రవర్తనతో హిందువుల మనోభావాలు దెబ్బతీసిన ఆయన పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారణ జరిపించి పదవి నుంచి తొలగిం చాలని, తిరుమల పవిత్రతను కాపాడాలని కోరారు. రూరల్ వైసిపి శ్రేణులు స్థానిక బాలాజీ పేట శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో శనివారం చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిం చారు. తిరుమల అపవిత్రం చేసిన బి ఆర్ బి ఆర్ నాయుడును తొలగిం చాలని, తిరుమల దేవస్థానం పవిత్రతను కాపాడాలని, హిందూ భక్తుల మనోభావాలను కాపాడాలని, కూటమి ప్రభుత్వ పాలన సిగ్గు, సిగ్గు


ప్ల కార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో చెల్లు బోయిన మాట్లాడుతూ

పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ గా ఉంటూ అసభ్య ప్రవర్తన వీడియోలతో, హిందూ భక్తుల మనోభావాలను, తిరుమల పవిత్రత ను దెబ్బతీశారని విమర్శించారు. అంతకుముందు కూటమి ప్రభుత్వ నేతలు , సీఎం చంద్రబాబు నాయుడు పవిత్రమైన లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కల్తీ జరిగిందని హిందువులను మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఎస్వీ వి బీసీ చైర్మన్ గా ఉన్న పృథ్వీరాజ్ అనే సినీనటుడిని అసభ్యంగా మాట్లాడితే పదవి నుంచి తొలగించిన జగన్ సంగతిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ వైసిపి నాయకులు గొందేసి శ్రీనివాసరెడ్డి, నక్క రాజబాబు, దాసరి ధర్మ, సత్య గిరి ,రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ మొల్లేరు--జడేరు గ్రామాల్లో పర్యటించిన డిప్యూటీ ఎంపీడీవో గోపన్నదొర







**గంగవరం, పెన్ పవర్ ఏప్రిల్ 4 :** స్వర్ణ మొల్లేరు మరియు స్వర్ణ జడేరు గ్రామాల స్పెషల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఎంపీడీవో కె. గోపన్నదొర శనివారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మంచినీటి సరఫరా సక్రమంగా జరుగుతున్నదా అనే విషయాన్ని పరిశీలించి, ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజలకు తాగునీరు అందించాలని సిబ్బందికి సూచించారు.మొల్లేరు గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆయన, ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సిన పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు ఆదేశించారు. అలాగే జడేరు గ్రామంలో మంచినీటి ట్యాంకును పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు సరఫరా చేయాలని తెలిపారు.గ్రామ పరిశు భ్రతపై ప్రత్యేక దృష్టి సారించిన గోపన్నదొర, స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు డోర్ టు డోర్ చెత్త సేకరణ చేపట్టి గ్రామాన్ని శు భ్రంగా ఉంచాలని ఎస్ డబ్ల్యు పి సి సిబ్బంది, క్లాప్ మిత్రలకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు మరియు స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో కల్తీ పాలపై నియంత్రణ చర్యలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఏప్రిల్ 4 :**జిల్లాలో కల్తీ పాల ఘటనల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ , ఫుడ్ సేఫ్టీ విభాగాలు సంయుక్తంగా విస్తృత చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పశు సంవర్ధక అధికారి టి. శ్రీనివాస రావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కె. సుప్రియ శనివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 705 పాల నమూనాలను పరీక్షించగా, అందులో 15 నమూనాల్లో కల్తీ ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. వాటిలో 1 యూరియా, 8 డిటర్జెంట్, 2 మాల్టోడెక్స్ట్రిన్, 5 నాణ్యత ప్రమాణాలకు తగని నమూనాలు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులపై ఆహార భద్రతా చట్టం అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22 నుండి జిల్లాలో ర్యాండమ్‌గా రాపిడ్ టెస్టులు నిర్వహిస్తూ కల్తీ పాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వారం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ర్యాండమ్ గా రాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాలు ఉత్పత్తి, సరఫరా, మార్కెటింగ్, ఇంటింటికి విక్రయాలు చేసే వారందరూ తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని స్పష్టం చేశారు. స్థానిక పశు సంవర్ధక శాఖ లేదా సచివాలయ సిబ్బందిని సంప్రదించి తమ వివరాలను ఎఫ్ ఎఫ్ ఎస్ ఏ ఐ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పాలు, అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారిని గుర్తించి, వారి పేర్లు నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించడం జరుగుతోందని తెలిపారు. ఇంటి వద్ద లేదా విడిగా పాలు కొనుగోలు చేస్తున్న ప్రజలను భాగస్వామ్యం చేస్తూ, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో కల్తీ పాల వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ద్వారకాతిరుమల పుణ్యక్షేత్ర అభివృద్ధి సహకరించండి. ఎమ్మెల్యే మద్దిపాటి.





**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 4.** నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రీ సెల్వి ను కోరారు. జిల్లా సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. ఏలూరులో స్థానిక కార్యాలయంలో డి ఆర్ సి సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ కు సకాలంలో బస్సు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. భక్తులకు సరిపడా బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గ పరిధిలో ఉన్న రహదారులను నిర్మించాలన్నారు. తిరుమల పాలెం గ్రామంలో ఉన్న భూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ద్వారక తిరుమల మండల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో ఆయన నియోజకవర్గం శాసనసభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్ళపూడి పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 4:**ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్ ల పదవీకాలం ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రతీ గ్రామ పంచాయతీలో ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్స్ ని నియమించడం జరిగింది. శనివారం తాళ్ళపూడి ఎంపిడిఓ ఎస్.వేణుగోపాల్ రెడ్డి తాళ్ళపూడి గ్రామ పంచాయతీలో స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

# వీరాపురం వద్ద రోడ్డు ప్రమాదం





**బైక్ ఢీకొన్న తుఫాన్ వాహనం**
**వ్యక్తి మృతి, నలుగురికి గాయాలు**

**చింతూరు, పెన్ పవర్ ఏప్రిల్ 4:** చింతూరు మండలంలోని వీరాపురం వద్ద శనివారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన తుఫాన్ వాహనం బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని చింతూరు మండలం వీరాపురం గ్రామానికి చెందిన మోసం బుచ్చయ్య (40)గా గుర్తించారు. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో అతను ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. అదే సమయంలో తుఫాన్ వాహనంలో మొత్తం 11 మంది ప్రయాణిస్తుండగా, ప్రమాదం కారణంగా నలుగురికి గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని వెంటనే చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో వీరాపురం ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

# జగ్గంపేట నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా నైదాన రవి.



**కిర్లంపూడి, పెన్ పవర్ ఏప్రియల్ 04:** జగ్గంపేట నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడుగా కిర్లంపూడి గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు నైదాన రవి నియమితులయ్యారు. శనివారం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య నైదాన రవికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నైదాన రవి మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో బీసీల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులను నియమించేందుకు అన్ని చర్యలు చేపడతానన్నారు. జగ్గంపేట నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన నైదాన రవికి కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం గ్రామాలకు చెందిన పలువురు ప్రముఖులు, పెద్దలు అభినందనలు తెలియజేశారు.

# జగ్గంపేటలో పోలీసుల కార్డెన్ సెర్చ్




**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 4:** జగ్గంపేట నెహ్రూ కాలనీలో జగ్గంపేట సీఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో సిబ్బందితో శనివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు, గండేపల్లి ఎస్సై శివ నాగబాబు, కిర్లంపూడి ఎస్సై సతీష్ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. కాలనీలో సుమారు 100 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి, సరైన ధ్రువపత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించినా, మత్తు పదార్థాలు విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దొంగతనాలు జరగకుండా స్థానికులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచనలు చేశారు.

# నక్కాఅప్పలరాజు వ్యాపారంగంలో మరిన్ని విజయాలు సాధించాలి.

ప్రత్తిపాడు వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.





**కిర్లంపూడి, పెన్ పవర్ ఏప్రియల్ 04:** స్నేహశీలి సౌమ్యుడు,నక్కా అప్పలరాజు వ్యాపార రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు.
కిర్లంపూడి మండలం జగపతినగరం నక్కా అప్పలరాజు స్వగృహంలో నూతన కోకో కోలా వైష్ణవి ఏజెన్సీ ప్రారంభోత్సవం ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముద్రగడ గిరిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి వైష్ణవి ఏజెన్సీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ, అప్పలరాజు వ్యాపార రంగంలో మరిన్ని విజయాలు అందుకోవాలని, సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోకోకోలా అసిస్టెంట్ సేల్స్ మేనేజర్, బి అప్పన్నదొర, సేల్స్ ఎగ్జిక్యూటివ్ లు, జి సుబ్రహ్మణ్యం,ఆర్ మణికంఠ, జగపతినగరం మాజీ సర్పంచ్ లు పెంటకోట నాగబాబు, కర్రి సూర్య కుమార్, కిర్లంపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు చదలవాడ బాబి, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు కుర్ల చినబాబు, టిడిపి నాయకులు తుమ్ కుమార్, కాళ్ళ వెంకటేష్, పెద్దలు ఆడారు సోమేశ్వరావు తూము చినబాబు, శరకణం భద్రం, లంక మూర్తి, కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం గ్రామాలకు చెందిన పలువురు పెద్దలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని నక్కా అప్పలరాజు వ్యాపారాభివృద్ధి సాధించాలని ఆశీస్సులు అందజేశారు.

# పంచాయితీలలో బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు.



**గోకవరం పెన్ పవర్ ఏప్రియల్ 04:**--పంచాయతీ పాలకవర్గాల సమయం ముగిసిపోవడంతో ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారులు నియామకం జరిగింది దీనిలో భాగంగా గోకవరం మండలానికి చెందిన 14 పంచాయతీలలో శనివారం సంబంధిత అధికారులు వివిధ పంచాయతీలవెళ్లి బాధ్యతలు స్వీకరించారు. గోకవరం ఎంపీడీవో ఎం గోవిందు రంపఎర్రంపాలెం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది ఎంపీడీవో గోవింద్ కు స్వాగతం పలికారు.గాదెలపాలెం పంచాయతీలో గోకవరం తాసిల్దార్ పి రామకృష్ణ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు అక్కడ పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది తాసిల్దార్ పి రామకృష్ణ కు స్వాగతం పలికారు. వెదురుపాక కామరాజుపేట గ్రామాలకు చెందిన ప్రత్యేక అధికారి రూరల్ ఆర్డబ్ల్యూఎస్ రామకృష్ణ ఉదయం నుండి డివిజనల్ స్థాయి సమావేశం ఉండడంతో మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ ప్రత్యేక అధికారిగా రాత్రి ఏడు దాటిన తర్వాత బాధ్యతలు చేపట్టారు. కాగా మరో ప్రత్యేక అధికారి తన వ్యక్తిగత సెలవుతో ఉండడం వల్ల సోమవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

# అడ్డతీగల లో రన్ ఫర్ జీసస్..






**అడ్డతీగల, పెన్ పవర్, ఏప్రియల్ 04:**గుడ్ ఫ్రైడే అలాగే ఈస్టర్ మధ్య రోజైన శనివారం అడ్డతీగలలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్ నిస్సి కుమార్ మరియు రన్ ఫర్ జీసస్ కోఆర్డినేటర్ ఆరోగ్య రాజు ఆధ్వర్యంలో, రన్ ఫర్ జీసస్ ర్యాలీ అడ్డతీగల పురవీధులలో శనివారం ఉదయం 7 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించారు. అడ్డతీగల మండలంనలుమూలల నుండి సుమారు 500 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని, యేసు కొరకు పరిగెడదాం, ఏసు యొక్క ప్రేమ ,సహనం, దయా గుణాలను లోకానికి ప్రకటిద్దాం అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం నాయకులు మరియు మండలంలో ఉన్న దైవజనులు మరియు విశ్వాసులు పాల్గొని, ఈ కార్యక్రమమును విజయవంతం చేశారని పాస్టర్ నిస్సి కుమార్ తెలిపారు.ద

## ఉల్లి గణ ఆధ్వర్యంలో జక్కంపూడి గణేష్ జన్మదినం వేడుకలు..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కూలింగ్ వాటర్ ప్యూరిఫై,15 కుర్చీలను బహుకరణ..



**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రిల్ 4:**కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం జక్కంపూడి గణేష్ పుట్టినరోజు వేడుకలు ఉల్లిగన ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్రామానికి ఉల్లి గణ ఆర్థిక సాయంతో సమకూర్చిన కూలింగ్ వాటర్ ప్యూరిఫై,15 కుర్చీలను నాయకులు చేతుల మీదుగా ఆసుపత్రికి అందజేశారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ఆదుకునే వ్యక్తి గణేష్ అని పేర్కొ న్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి తాడి హరిచంద్ర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ యువకులు గణేష్ పుట్టిన రోజు సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం కంటే సేవా కార్యక్రమాలకు ఆ సమ్ములు వినియోగిస్తే బాగుంటుందని సూచిం చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ఉల్లి బుజ్జి బాబు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కే శ్రీనివాస్, కోరుకొండ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్, ఎం చిన్ని, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఎట్టకేలకు తీరిన సిక్కోలు వాసుల కల

**శ్రీకాకుళం ఏప్రిల్ 4, పెన్ పవర్:** శ్రీకాకుళం జిల్లావాసుల చిరకాల కోరిక నెరవేరింది. శ్రీకాకుళం జిల్లాలోని పలాస ఇచ్ఛాపురం సెక్షన్‌లోని ఏడు రైల్వే స్టేషన్‌లను..ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని కుర్దా రోడ్ డివిజన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లోని విశాఖపట్నం డివిజన్‌కు మార్చారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎన్నో ఏళ్ల కోరిక నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు.విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధికి సంబంధించి మరో కీలక ముందడుగు పడింది. ఒడిశాలోని ఖుర్దా డివిజన్‌లో ఉన్న పలాస-ఇచ్ఛాపురం సెక్షన్ తాజాగా విశాఖ డివిజన్ పరిధిలోకి మార్చేశారు. ఈ మేరకు రైల్వే బోర్డు నిర్ణయం తీసుకోగా.. దక్షిణ కోస్తా, తూర్పు కోస్తా జోన్ జనరల్ మేనేజర్లకు ఉత్తర్వులు అందాయి. దీనిపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు కీలక ప్రకటన చేశారు.. ఏడు రైల్వే స్టేషన్‌లు విశాఖపట్నం డివిజన్‌లోకి వచ్చినట్లు తెలిపారు.శ్రీకాకుళం జిల్లాలోని పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న 7 రైల్వే స్టేషన్లను.. ఈస్ట్ కోస్ట్ రైల్వే కుర్దా రోడ్ డివిజన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖపట్నం డివిజన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. 2019లో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటించినప్పటి నుంచి తాను ఈ డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లానని.. ఎట్టకేలకు ఏడు రైల్వేస్టేషన్‌లు విశాఖపట్నం డివిజన్‌లోకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది శ్రీకాకుళం ప్రజల చిరకాల కోరికని.. మొత్తానికి నెరవేరినందుకు ఆనందంగా ఉందన్నారు.ఈస్ట్ కోస్ట్ రైల్వే కుర్దా రోడ్ డివిజన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖపట్నం డివిజన్‌కు మార్చిన ఆ 7 రైల్వే స్టేషన్‌లు ఇలా ఉన్నాయి. పలాస, సుమ్మా దేవి, మందస రోడ్, బారువ, సోంపేట, జాడుపూడి, ఇచ్ఛాపురం స్టేషన్లను.. దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి రావడం ద్వారా పరిపాలనా సామర్థ్యం పెరిగి, ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు శ్రీకాకుళం ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.మరోవైపు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వంశధార నదిపై నేరడి బ్యారేజి నిర్మాణంకు అనుకూలంగా ట్రిబ్యునల్ తీర్పు ఇవ్వడం.. అందుకు అనుగుణంగా కేంద్ర జలశక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు. రెండు రాష్ట్రాల మధ్య సున్నితమైన అంశంపై ఈ సమస్య పరిష్కారం కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. పార్లమెంట్‌లో, కేంద్ర మంత్రులతో సమస్యను చర్చిస్తూ.. చివరికి పరిష్కారం సాధించుకున్నామన్నారు. నేరడి బ్యారేజి నిర్మాణంతో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా మరింత సస్యశ్యామలం అవుతుందని విశ్వసిస్తున్నానని.. ఈ విజయంలో తోడ్పాటు అందించిన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పోరాటానికి సరైన కార్యాచరణతో పరిష్కారం దిశగా నడిపించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి శ్రీకాకుళం రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

**అద్దె కార్యాలయం రెడీ**

విశాఖ రైల్వే జోన్ పరిధిలో మార్పులు చేసింది. గత కొంతకాలంగా వస్తున్న డిమాండ్లకు అనుగుణంగా నిర్ణయం వెల్లడించింది. శ్రీకాకుళం జిల్లా పలాస- ఇచ్ఛాపురం మధ్య ఏడూ రైల్వే స్టేషన్లను విశాఖ రైల్వే జోన్ లో చేర్చింది. కొత్తగా ఏర్పడిన విశాఖ డివిజన్లో సైతం కలిపింది. ఈ నిర్ణయంతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. ఇచ్ఛాపురం నుంచి పలాస మధ్య ఉన్న 7 రైల్వే స్టేషన్లు ఇకనుంచి సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలోకి రానున్నాయి.. మొన్ననే విశాఖ రైల్వే జోన్ తో పాటు విశాఖ డివిజన్ ఏర్పాటు చేసింది రైల్వే శాఖ. ఈస్ట్ కోస్ట్ పరిధిలో ఉన్న చాలా స్టేషనులను విశాఖ జోన్ లో చేర్చింది. కానీ పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న 7 రైల్వే స్టేషన్లను ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ లోనే ఉంచేసింది.మరోవైపు విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. అయితే శాశ్వత భవన నిర్మాణ పనులు
కొనసాగుతున్నాయి. మరోవైపు ఓ ప్రైవేటు భవనంలో కార్యాలయానికి సంబంధించి కార్యకలాపాలు మొదలు పెట్టాలని నిర్ణయించుకుంది రైల్వే శాఖ. విశాఖ కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ను నాలుగు డివిజన్ల తో ఏర్పాటు చేశారు. విజయవాడ, గుంటూరు, గుంతకల్, విశాఖ డివిజన్లుగా విభజించారు. ఎప్పటినుంచో ఉన్న వాల్తేరు డివిజన్ ను రెండుగా విభజించారు. ఒక భాగాన్ని విశాఖ డివిజన్ గా చేశారు. మరో భాగాన్ని ఒడిస్సాలోని రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ రైల్వే డివిజన్ పరిధిలోకి శ్రీకాకుళం జిల్లాలో

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మంత్రలయానికి మంచి రోజులు

**కర్నూలు, ఏప్రిల్ 4, పెన్ పవర్:** కర్నూలు జిల్లా మంత్రాలయానికి బైపాస్ రోడ్డుకు సంబంధించి తొలి అడుగు పడింది. కొత్త బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.59 కోట్లతో మంత్రాలయానికి బైపాస్‌ను రెండు లైన్లుగా నిర్మిస్తున్నారు. ఈ బైపాస్ అందుబాటులోకి వస్తే మంత్రాలయానికి ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే. నిత్యం మంత్రాలయానికి భక్తులు తరలివస్తుంటారు.. ఈ క్రమంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రభుత్వం బైపాస్ రోడ్డు కోసం నిధులు విడుదల చేసింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా హైవేలు, స్టేట్ హైవేలతో పాటుగా అవసరమైన చోట్ల రోడ్లను విస్తరిస్తున్నారు. అలాగే కొన్ని నగరాలకు, పట్టణాలకు బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నారు. రాయలసీమలో కూడా రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇటీవల మంత్రాలయం బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదలైన సంగతి తెలిసిందే. అయితే తాజాగా మంత్రాలయం బైపాస్ నిర్మాణానికి తొలి అడుగు పడింది. మంత్రాలయం బైపాస్‌కు శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు స్థానిక నేతలతో కలిసి భూమిపూజ నిర్వహించారు. రూ.59 కోట్లతో నిర్మించే ఈ రెండు లైన్ల బైపాస్ నిర్మాణం పూర్తయితే మంత్రాలయానికి ట్రాఫిక్ చిక్కులు తొలగిపోతాయంటున్నారు.కర్నూలు జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి కొలువై ఉన్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి నిత్యం దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, సినీ, రాజకీయ, వ్యాపారంగాల నుంచి ప్రముఖులు వస్తుంటారు. వీరితో పాటుగా నిత్యం భక్తులు మంత్రాలయం వస్తుండటంతో వాహనాల రద్దీ కూడా పెరిగింది. మంత్రాలయం వచ్చే భక్తులకు తోడు స్థానికుల వాహనాలతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 167వ నంబర్ జాతీయ రహదారి మంత్రాలయం మధ్య నుంచి వెళుతుండంతో ట్రాఫిక్ రద్దీ కనిపిస్తోంది.. భక్తులు కూడా ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంపై శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఫోకస్ పెట్టారు.శ్రీమఠం పీఠాధిపతి, ప్రజా ప్రతినిధులు మంత్రాలయానికి బైపాస్ రోడ్డు కావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. బైపాస్ రోడ్డు నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యల నుంచి రిలీఫ్ దక్కుతుందని వివరించారు. ఈ మేరకు కల్లుదేవకుంట- చెట్నేపల్లి మధ్య 4 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. బైపాస్ నిర్మించేందుకు మొత్తం రూ.59 కోట్లతో నిధులు కూడా విడుదల కాగా.. బైపాస్ కోసం భూమిని సేకరించి భూమిపూజ చేశారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ ఇంఛార్జ్ రాఘవేంద్ర రెడ్డి. మంత్రాలయం క్షేత్ర అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు.

## తెగేవరకు లాగుతున్న అరవ

**కడప, ఏప్రిల్ 4, పెన్ పవర్:** జనసేన అంటేనే ఒక భరోసా.. ఒక ప్రశ్న!. సమాజంలోని అబలలు, ఆర్తుల పక్షాన పోరాడతామని ప్రతిన బూనిన పార్టీ. అందుకే.. అనంతపురం నుంచి అనకాపల్లి వరకు జనసేనపై ప్రజలకు గట్టి నమ్మకం.. పవన్ వస్తున్నాడంటే.. తమ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించే వారు లక్షల్లో ఉన్నారు. అలాంటి ఇమేజ్ సంపాయించుకున్న జనసేనాని, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్.. కొందరు చేస్తున్న పనుల కారణంగా.. పరువు పోగొట్టుకునే పరిస్థితి వస్తోందని..ఆయన అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ ఉద్యోగినిని లోబరుచుకుని.. ఐదు సార్లు అబార్షన్ చేయించారన్న ఆరోపణలు ఉన్నాయి. స్వయంగా బాధితురాలే.. మీడియాముందుకువ చ్చి విషయం చెప్పింది. దీనిపై జనసేన అధినేత విచారణ కమిటీ వేశారు. కానీ.. ఏం తేల్చారో.. ఇప్పటికీ తెలియదు. పోనీ.. అది అరవ శ్రీధర్ వ్యక్తిగత వ్యవహారమని పేర్కొన్నా.. మరి ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతున్న నేపథ్యంలో మరింత బాధ్యతగా ఉండాలనైనా సూచించాలి. చిలికి చిలికి గాలివానగా మారినట్టు.. తాజాగా బాధితురాలిని.. నడిరోడ్డుపై.. అరవ శ్రీధర్ సమక్షంలోనే.. ఆయన ప్రధాన అనుచరుడు తాతంశెట్టి నాగేంద్ర.. పోలీసుల నుంచి లాఠీని లాక్కు ని మరీ చితకబాదడం.. బాధితురాలి వ్యక్తిగత వ్యవహారం అనాలా.. లేక.. అరవ శ్రీధర్ వ్యక్తిగత వ్యవహారం అనాలా? అనేది ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఎదురవుతున్న సమస్య. పూలు కొన్నుకు నేందుకు వచ్చిన బాధితురాలిని గమనించిన ఎమ్మెల్యే వర్గం.. ఆమెను ఉరికించి ఉరికించి చితక్కొట్టడం .. సంచలనంగా మారింది. అక్కడే ఉన్న పోలీసులు(తమ చేతిలో లాఠీని లాక్కున్నా చోద్యం చూశారు)కానీ.. కారులో కూర్చుకున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కానీ.. ఈ దారుణాన్ని ఆపలేదు. ఇదేసమయంలో బాధితురాలి లాయర్‌ను కూడా చితక్కొట్టి .. ఊరి నుంచి పొమ్మన్నారు. అయితే.. వాస్తవానికి ఈ సమస్య అరవ శ్రీధర్ వ్యక్తిగత మని అనుకున్నా.. అంతిమంగా పార్టీపైనే మచ్చలు , మరకలు పడుతున్నాయి. ఇకనైనా ఈ ఎపిసోడ్‌కు ముగింపు పలకకపోతే.. అది జనసేననై వ్యతిరేక ప్రచారాన్ని తీసుకువస్తుంది.. పార్టీ పరువుకు కూడా భంగం కలిగిస్తుందనడంలో సందేహం లేదని అంటున్నారు పరిశీలకులు

# అమరావతి అసలు చాలెంజ్ మొదలు

**విజయవాడ, ఏప్రిల్ 4, పెన్ పవర్:** అమరావతి రాజధాని అంశంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తీసుకువచ్చాయి. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడంతో ఈ రాజధానికి చట్టబద్ధత లభించిందనే భావన బలపడింది. దీంతో ఇప్పటివరకు ఉన్న అనుమానాలు, సందేహాలు చాలా వరకు తొలగిపోయాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పినట్లు అమరావతిని ఇక ఎవ్వరూ మార్చలేరనే నమ్మకం ప్రజల్లో పెరుగుతోంది. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ నిర్ణయాన్ని మార్చడం సులభం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇప్పటి నుంచి అసలు సవాలు అభివృద్ధి దిశగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం మీద భారీ బాధ్యత ఉంది. అమరావతి కోసం ఇప్పటికే వేలాది ఎకరాలు సేకరించబడ్డాయి. ఇప్పుడు ఆ భూముల్లో ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలు చేపట్టాలి. ప్రభుత్వ పరంగా సచివాలయం , అసెంబ్లీ, హైకోర్టు భవనాలతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలకు నివాస సముదాయాలు నిర్మించాల్సి ఉంది. ఇవి ప్రారంభమైతే పరిపాలన క్రమంగా అమరావతికి మారే అవకాశం ఉంటుంది.అయితే అభివృద్ధి పూర్తిగా ప్రభుత్వంతోనే సాధ్యం కాదు. ప్రైవేట్ రంగం కూడా కీలక పాత్ర పోషించాలి. వారికి కేటాయించిన భూముల్లో వేగంగా నిర్మాణాలు జరిగితేనే నగరానికి నిజమైన రూపం వస్తుంది. వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, పరిశ్రమలు ఏర్పడితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఈ విధంగా జనసంచారం పెరిగితే అమరావతి ఒక జీవంతో నిండిన నగరంగా మారుతుంది.ఒక నగరం ఎదగాలంటే ఫ్లోటింగ్ పాపులేషన్ ( చాలా ముఖ్యం. ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు, విద్యా సౌకర్యాలు ఉన్నచోటే ప్రజలు చేరతారు. అందుకే పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, విశ్వవిద్యాలయాలు వంటి సంస్థలను ఆకర్షించడం అవసరం. ఇది ఒక్కరోజులో జరిగే పని కాదు. దీర్ఘకాలిక ప్రణాళికతో



క్రమంగా ముందుకు వెళ్లాలి. పాలకుల చిత్తశుద్ధి, పట్టుదల ఈ విషయంలో చాలా కీలకం.రైతులకు ఇచ్చే రీటర్న్ ప్లాట్లు కూడా అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. వారు తమ భూముల్లో నిర్మాణాలు ప్రారంభిస్తే ప్రాంతంలో చురుకుదనం పెరుగుతుంది. అలాగే అధికారులు, ఉద్యోగులు అక్కడే నివసించేలా ప్రోత్సహిస్తే నగరానికి కొత్త ఉత్సాహం వస్తుంది. ప్రభుత్వం సరైన ప్రోత్సాహాలు, సౌకర్యాలు అందిస్తే ఈ ప్రక్రియ వేగవంతమవుతుంది.రాజకీయంగా చూస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తమ అభిప్రాయాన్ని ఇప్పటికే వెల్లడించింది. అమరావతికి వ్యతిరేకం కాదని చెబుతూ, అభివృద్ధి ఖర్చులపై సందేహాలు వ్యక్తం చేసింది. అయితే ఈ అంశంపై ప్రజలు ఇప్పటికే 2024 ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. భవిష్యత్తులో వారి అభిప్రాయం ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది.ఇప్పుడు అందరి దృష్టి కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపైనే ఉంది. అమరావతిని విజయవంతంగా అభివృద్ధి చేస్తే చంద్రబాబు నాయుడు చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించే అవకాశం ఉంది.

ఈ అవకాశం ప్రతి నాయకుడికి రాదు. అందుకే ఈ బాధ్యతను ఎలా నిర్వర్తిస్తారన్నది కీలకం. మొత్తంగా చూస్తే అమరావతి భవిష్యత్తు ఇప్పుడు కార్యాచరణపై ఆధారపడి ఉంది. సరైన దిశలో అడుగులు వేస్తే ఇది దేశంలోనే ఒక మోడల్ క్యాపిటల్‌గా నిలవొచ్చు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడు ఈ అభివృద్ధిని ఆసక్తిగా గమనిస్తున్నాడనే విషయం గుర్తుంచుకోవాలి.

# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న జగన్

**విజయవాడ, ఏప్రిల్ 4, పెన్ పవర్:** ప్రస్తుతం రాజకీయంగా ఆత్మరక్షణలో పడటమే కాకుండా వరుస తప్పిదాలతో సెల్ఫ్ గోల్స్ వేసుకుంటోంది. అమరావతి రాజధాని అంశం మొదలుకొని తాజా మత మార్పిడి వ్యవహారాల వరకు ప్రతి నిర్ణయం పార్టీ ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలు సైతం నాయకత్వ ధోరణి చూసి అయోమయానికి గురవుతున్నారు.రాజధాని అమరావతికి పార్లమెంట్ సాక్షిగా చట్టబద్ధత లభిస్తున్న తరుణంలో వైసీపీ అనుసరించిన తీరు ఆ పార్టీకి తీరని నష్టం చేకూర్చింది. ఒకవైపు వికేంద్రీకరణ అంటూనే, మరోవైపు రాజ్యాంగబద్ధంగా జరుగుతున్న ప్రక్రియను అడ్డుకోలేక సభ నుంచి వాకౌట్ చేయడం ద్వారా ఓటమిని అంగీకరించినట్లయింది. ఈ పరిణామం ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోనూ పార్టీ పట్ల నమ్మకాన్ని తగ్గించింది. రాజధాని విషయంలో స్పష్టమైన వైఖరి లేకపోవడం వల్ల అటు ప్రజలు, ఇటు క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలో ఒక ముస్లిం జంటను హిందూ మతంలోకి మార్చిన ఉదంతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. హిందూ ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలనే తాపత్రయంతో చేసిన ఈ పని వికటించేలా కనిపిస్తోంది. నిజానికి రాష్ట్రంలో క్రైస్తవ మతంలోకి మారిన వారిని తిరిగి హిందూత్వంలోకి తీసుకురావాలనే డిమాండ్లు ఎక్కువగా ఉన్నాయి. కానీ వాటిని పట్టించుకోకుండా, ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే ముస్లింలను మత మార్పిడి



అంశంలోకి లాగడం చర్చనీయాంశమైంది.వైసీపీ ఆవిర్భావం నుండి ముస్లింలు ఆ పార్టీకి బలమైన అండగా నిలుస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు భూమన కరుణాకర్ రెడ్డి నేరుగా ఒక ముస్లిం కుటుంబాన్ని మతం మార్చి దానిని గొప్పగా ప్రచారం చేసుకోవడం ఆ వర్గంలో ఆగ్రహాన్ని కలిగిస్తోంది. మైనారిటీల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్న ఈ చర్య వల్ల రాబోయే రోజుల్లో ఆ ఓటు బ్యాంకు పార్టీకి దూరం అయ్యే ప్రమాదం ఉంది. సొంత పార్టీ నేతలే ఈ వ్యవహారంపై లోలోపల మదనపడుతున్నారు.పార్టీ తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల క్షేత్రస్థాయిలో సమాధానం చెప్పుకోలేక వైసీపీ కార్యకర్తలు సతమతమవుతున్నారు. ఒక సమస్యను పరిష్కరించబోయి మరో కొత్త సమస్యను సృష్టించుకోవడం నాయకత్వ లోపంగా కనిపిస్తోంది. హిందూత్వ కార్డు వాడాలా లేక మైనారిటీలను కాపాడుకోవాలా అనే సందిగ్ధంలో పార్టీ కొట్టుమిట్టాడుతోంది. ఇలాంటి గందరగోళ పరిస్థితుల వల్ల పార్టీ కేడర్ మానసికంగా కుంగిపోతోంది. రాజకీయాల్లో ఏ నిర్ణయమైనా ఆచితూచి తీసుకోవాలి. కానీ వైసీపీ మాత్రం వరుసగా వివాదాస్పద అంశాలను నెత్తిన వేసుకుంటోంది. అమరావతి విషయంలో ప్రజల నాడిని పట్టుకోలేకపోవడం, మతపరమైన అంశాల్లో అనవసర జోక్యం చేసుకోవడం వల్ల పార్టీ పునాదులు కదులుతున్నాయి. తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తగిలే అవకాశం ఉంది.

# ఇంపాక్ట్‌గా వచ్చి ఇరగదీసిన రిజ్వీ.. ముంబైపై ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ లో భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానంలో జరుగుతున్న పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచులో ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన సమీర్ రిజ్వీ (90 పరుగులు) మరోసారి అసలైన పైసా వసూల్ పర్ఫార్మెన్స్ అంటే ఏంటో చూయించాడు. టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ మొదట ఫీల్డింగ్ తీసుకున్నాడు. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ జట్టు 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. ముంబై బ్యాటర్లలో సూర్యకుమార్ యాదవ్ (51) హాఫ్ సెంచరీ చేయగా, రోహిత్ (35), నమన్ ధీర్ (28) అద్భుతమైన బ్యాటింగ్ తో కీలక పాత్ర పోషించారు. అనంతరం 163 పరుగుల లక్ష ఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆదిలోనే బిగ్ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ మరోసారి ఘోరంగా విఫలం కాగా.. ఆ తర్వాత బ్యాటింగ్ కి వచ్చిన నితీష్ రాణా (0) రనౌట్ అయ్యాడు. దీంతో కేవలం 7 పరుగులకే ఢిల్లీ కీలకమైన రెండు వికెట్లను నష్టపోయింది. ఓపెనర్ పతుమ్ నిస్సంకతో కలిసి ఇంపాక్ట్ ప్లేయర్ సమీర్ రిజ్వీ 66 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అనంతరం మిచెల్ శాంట్నర్ బౌలింగ్ లో నిస్సంక (30 బంతుల్లో 6 ఫోర్లు ఒక సిక్సుతో 44 పరుగులు) కొట్టిన బంతి నేరుగా మయాంక్ మార్కండే చేతిలో పడటంతో పెవిలియన్ కి వెళ్లిపోయాడు.

ఇక ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన రిజ్వీ మరోసారి తన ఇంపాక్ట్ చూపించాడు. తనదైన ట్రేడ్ మార్క్ షాట్స్ తో కష్టాల్లో ఉన్న జట్టుని సమీర్ ( 51 బంతుల్లో 7 ఫోర్లు 7 సిక్సులతో 90 పరుగులు) అర్ధ శతకంతో మ్యాచుని విజయ తీరాలకు చేర్చగా.. చివర్లో డేవిడ్ మిల్లర్ (21బి), ట్రిస్టన్ స్టబ్స్(3బి) మరో 18.1 ఓవర్లలోనే మ్యాచ్ ని కంప్లీట్ చేసేశారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇక, ముంబై ఇండియన్స్ బౌలర్లలో మిచెల్ శాంటర్న్, దీపక్ చాహర్, కార్బిన్ బాష్ తలో వికెట్ పడగొట్టారు.

# టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న రాజస్థాన్.. కెప్టెన్‌నే మార్చేసిన గుజరాత్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగుతున్న కీలక పోరులో రాజస్థాన్ రాయల్స్ టాస్ గెలిచింది. రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ తీసుకున్నాడు. ఈ మైదానంలో స్కోరును డిఫెండ్ చేయడం సులభమని భావించిన పరాగ్ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. మరోవైపు గుజరాత్ టైటాన్స్ (GT) జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కండరాల నొప్పితో (Muscle Spasm) ఈ మ్యాచ్‌కు దూరం అయ్యాడు. అతని స్థానంలో స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ జట్టు పగ్గాలను చేపట్టాడు. రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ మాట్లాడుతూ.. ముందుగా బ్యాటింగ్ చేయడం తమకు సరైన నిర్ణయం.. పిచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడాల్సిన అవసరం ఉందని తెలిపారు. సుమారు 210 పరుగుల భారీ స్కోరు సాధించి, దానిని డిఫెండ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జట్టు అన్ని పరిస్థితుల్లో ఆడగలిగే విధంగా తయారవ్వాలని ఆకాంక్షించారు. ఇక తుది జట్టులో రెండు మార్పులు చేశాం.. బ్రిజేష్ స్థానంలో తుషార్ దేశ్‌పాండే చోటు దక్కించుకున్నాడు. అలాగే రవి బిష్ణోయ్ స్థానంలో శుభమ్ దూబే జట్టులోకి వచ్చాడని పేర్కొన్నాడు. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ రషీద్ ఖాన్ మాట్లాడుతూ.. తాము టాస్ గెలిచి ఉంటే ముందుగా బౌలింగ్ చేయాలని అనుకున్నాం.. శుభ్‌మన్ గిల్‌కు కండరాల సమస్యతో ఈ మ్యాచ్ ఆడటం లేదు.. త్వరలోనే తిరిగి జట్టులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం.. కొత్త ఆటగాడు కేకే తన తొలి మ్యాచ్ ఆడుతున్నాడు.. అతని ప్రదర్శనను చూడటానికి ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. గత మ్యాచ్‌లోనూ జట్టు మంచి క్రికెట్ ఆడిందని, ఈ మ్యాచ్‌లో 100 శాతం సామర్థ్యంతో ఆడాల్సిన అవసరం ఉందని తెలిపాడు.

**తుది జట్లు:**

రాజస్థాన్ రాయల్స్: యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్(ఞ), రియాన్ పరాగ్(ఛ), షిమ్రాన్ హెట్మెయర్, డోనోవన్ ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, తుషార్ దేశ్‌పాండే, సందీప్ శర్మ

గుజరాత్ టైటాన్స్: కుమార్ కుషాగ్రా, సాయి సుదర్శన్, జోస్ బట్లర్(ఞ), గ్లెన్ ఫిలిప్స్, వాషింగ్టన్ సుందర్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్(ఛ), కగిసో రబడ, అశోక్ శర్మ, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ కృష్ణ

# ధోనీ రికార్డ్ బ్రేక్ చేసిన హిట్ మ్యాన్.. ఆరెంజ్ క్యాప్‌ని కైవసం చేసుకున్న రోహిత్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 ప్రారంభం నుంచే రోహిత్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్ చేస్తున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో కేవలం 38 బంతుల్లో 78 రన్స్ చేయగా.. ఈరోజు (2026, ఏప్రిల్ 4న) ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ 26 బంతుల్లో 35 పరుగులు చేసి మొత్తం 113 పరుగులతో అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్ల జాబితాలో నెంబర్ స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ ప్లేయర్ కూపర్ కునోలీ 108 పరుగులతో సెకండ్ ప్లేస్ లో కొనసాగుతున్నాడు. కాగా ఐపీఎల్ చరిత్రలో ఒకే ప్రత్యర్థిపై అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాళ్ల లిస్టులో రోహిత్ ఇప్పుడు కొత్త రికార్డు సృష్టించాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌పై హిట్ మ్యాన్ ఇప్పటి వరకు 51 సిక్సర్లు కొట్టాడు. దీంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై 50 సిక్సులు కొట్టిన మహేంద్ర సింగ్ ధోనీ పేరు ఉన్న రికార్డుని రోహిత్ బ్రేక్ చేసినట్లు అయింది. అలాగే విరాట్ కోహ్లీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై 48 సిక్సర్లతో ఈ జాబితాలో ఇంకా వెనకబడి ఉన్నాడు.

**ఒకే ప్రత్యర్థిపై అత్యధిక సిక్సర్లు:**

క్రిస్ గేల్ (పంజాబ్‌పై): 61
క్రిస్ గేల్ (కేకేఆర్ పై): 54
రోహిత్ శర్మ (ఢిల్లీపై): 51
ధోనీ ( ఆర్సీబీపై): 50
విరాట్ కోహ్లీ (సీఎస్కేపైపై): 48

కేవలం రన్స్ చేయడమే కాకుండా, రోహిత్ శర్మ సుమారు 176కు పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడం ఫ్యాన్స్ ని అలరిస్తోంది. ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్ ప్రారంభంలోనే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి జట్టుకు భరోసా కల్పిస్తున్నాడు. ముఖ్యంగా పుల్ షాట్లు, లాంగ్ ఆన్ దిశగా కొట్టే సిక్సులతో వాంఖడే స్టేడియంలో హోరెత్తించాడు. ఈ సీజన్‌లో రోహిత్ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే మరిన్ని రికార్డులు బ్రేక్ కావడం ఖాయమని క్రీడా పండితులు పేర్కొంటున్నారు. మరోవైపు కింగ్ కోహ్లీ కూడా అద్భుతమైన ఫామ్‌లో కనిపిస్తున్నాడు, రోహిత్ నెలకొల్పిన ఈ సిక్సర్ల రికార్డును అందుకోవడం కోహ్లీకి ఇప్పుడు సవాల్‌గా మారింది. హిట్ మ్యాన్ బ్యాటింగ్‌లో దూకుడుతో ముంబై జట్టుకు అదనపు బలాన్ని అందిస్తోంది. ఐపీఎల్ 2026లో ఆరెంజ్ క్యాప్ రేసులో రోహిత్, కోహ్లీ మధ్య పోటీ రాబోయే రోజుల్లో మరింత ఇంట్రెస్టింగ్ గా మారనుంది.

# ఇప్పటివరకూ శ్రీరాముడి పాత్రలో నటించిన స్టార్ల జాబితా







భారతీయ సినిమా- బుల్లితెర రంగాల్లో శ్రీరాముడి పాత్రకు ఉన్న ప్రాముఖ్యత అపారం. వెండితెరపై లేదా బుల్లితెరపై రామాయణ గాథను ఆవిష్కరించిన ప్రతిసారీ ప్రేక్షకులు ఆ పాత్రలను దైవ సమానంగా ఆరాధించారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుండి బాలీవుడ్ వరకు... బ్లాక్ అండ్ వైట్ కాలం నుండి నేటి విజువల్ వండర్స్ కాలం వరకు చాలా మంది స్టార్లు రాముడి పాత్రలో మెప్పించారు. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఎన్.టి. రామారావు ఈ పాత్రకు ఒక సంపూర్ణ అర్థాన్ని ఆపాదించారని చెప్పొచ్చు. లవకుశ, సంపూర్ణ రామాయణం వంటి చిత్రాలలో శ్రీరాముడి పాత్రతో తారకరాముడు లక్షలాది మంది హృదయాల్లో నిలిచిపోయారు. టాలీవుడ్ స్టార్ హీరోలు పౌరాణిక పాత్రలపై ఎప్పుడూ మక్కువ చూపేవారు. సీనియర్ ఎన్టీఆర్ తర్వాత అక్కినేని నాగేశ్వరరావు -శ్రీ రామ జననం- (1944) లో, శోభన్ బాబు -సంపూర్ణ రామాయణం- (1971)(బాపు దర్శకుడు) లో రాముడిగా నటించి తమదైన ముద్ర వేశారు. నందమూరి వారసుల్లో బాలకృష్ణ -శ్రీ రామ రాజ్యం- (2011) చిత్రంతో తండ్రికి తగ్గ తనయుడిగా మెప్పించగా... జూనియర్ ఎన్టీఆర్ -బాల రామాయణం- (1997) లో బాల రాముడిగా నటించి జాతీయ అవార్డును సైతం గెలుచుకున్నారు. సుమన్, ప్రభాస్ వంటి వారు కూడా విభిన్నమైన శైలిలో ఈ పాత్రను పోషించి మెప్పించారు. బుల్లితెర విషయానికి వస్తే.. 1987లో రామానంద్ సాగర్ రూపొందించిన -రామాయణ్- ఒక చరిత్రను సృష్టించింది. ఇందులో రాముడిగా నటించిన అరుణ్ గోవిల్ పై ప్రజలు ఎంతటి భక్తిభావం ప్రదర్శించారంటే.. ఆయనను నిజమైన రాముడిగానే భావించి పూజించేవారు. ఆ తర్వాత గుర్మీత్ చౌదరి (2008 రామాయణ్), ఆశిష్ శర్మ (సియా కే రామ్) .. సోనీ టీవీలో టెలికాస్ట్ అయిన -శ్రీమద్ రామాయణ్-లో సుజయ్ రేవూ రాముడి పాత్రలో నేటి తరం ప్రేక్షకులను అలరించారు. ఈ సీరియళ్లు హిందీతో పాటు ఇతర ప్రాంతీయ భాషల్లోనూ డబ్ అయ్యి దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నాయి. సినిమాల్లో కూడా బాలీవుడ్ హీరోలు ఈ పాత్రను పోషించేందుకు ఆసక్తి చూపారు. 1997లో వచ్చిన -లవ్ కుష్- చిత్రంలో అగ్ర నటుడు జితేంద్ర శ్రీరాముడిగా కనిపించి ఆకట్టుకున్నారు. జెన్ జెడ్ కాలంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ -ఆదిపురుష్- (2023) లో రాఘవ పాత్రలో ఆధునిక సాంకేతికతతో కూడిన రాముడిని పరిచయం చేశారు. హరనాథ్, కాంతారావు, శ్రీకాంత్ వంటి ఇతర తెలుగు నటులు కూడా పలు చిత్రాల్లో అతిథి లేదా ప్రధాన పాత్రల్లో రాముడిగా కనిపించి రామాయణ గాథను సజీవంగా ఉంచడంలో తమ వంతు కృషి చేశారు. ప్రస్తుతం భారతీయ సినిమా రంగం నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న -రామాయణ- చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇందులో బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ శ్రీరాముడిగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ , మేకింగ్ వివరాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. గతంలో వచ్చిన అన్ని వెర్షన్ల కంటే ఇది అత్యంత భారీ వ్యూహం తో సాంకేతిక మాయాజాలంతో బరిలోకి దిగుతుండటంతో.. రణబీర్ ఈ పాత్రలో ఎలా కనిపిస్తారనే ఉత్కంఠ నెలకొంది. ఈ ఏడాది దీపావళికి పార్ట్ 1, వచ్చే ఏడాది దీపావళికి పార్ట్ 2 విడుదల కానున్నాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965